

హైదరాబాద్ వార్త


# లోకల్ సరుకు... బ్రాండెడ్ ముసుగు

-అక్షరాలు మార్చి... ధరతో ఏమార్చి!
-ప్రధాన కంపెనీల పేర్లను తలపించేలా విద్యుత్ ఉపకరణాలు
-మార్కెట్‌లో విచ్చలవిడిగా స్థానిక తయారీ పరికరాల విక్రయం
-కొద్దికాలానికే వైఫల్యం, విద్యుదాఘాతంతో ప్రమాదాలు



హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త

నకిలీ విద్యుత్ సామగ్రి అమ్మకాలు మార్కెట్‌లో పెరిగిపోతున్నాయి. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం కాకుండా నాణ్యతలేని ముడిసరకుతో స్థానికంగా తయారు చేసిన వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల పేర్లను కొద్దిగా మార్చేసి... అవి కూడా బ్రాండెడే నంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. వీటి కారణంగా ఒక్కోసారి షాక్ తగిలి ప్రాణాలు కోల్పోతున్నారని విద్యుత్ శాఖవర్గాలు తెలిపాయి. ఇళ్లల్లో, వాణిజ్య సముదాయాల్లో ఉపయోగించే తీగలు, స్విచ్ బోర్డులు, బల్బ్‌లు, ఫ్యాన్లు, కుక్కర్లు, గ్రైండర్లు వంటి వాటికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆమోదం ఉంటేనే కొనాలి. కానీ, వ్యాపారుల మాయాజాలంలో చిక్కుకుని చవక వస్తువులనే కొంటూ ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏది అసలు, ఏది నకిలీ, ఏది లోకల్... అనేది కూడా పోల్చుకోలేనంతగా ప్యాక్ చేసి ఉంటున్న డబ్బాలతో తాము కొనేది బ్రాండెడ్ వస్తువులుగానే మరికొందరు అపోహపడుతున్నారు.

**ఎలక్ట్రిషియన్ చెబుతారు..వాళ్లు కొనేస్తారు!**

నగరంలో ప్రతి సంవత్సరం లక్షకుపైగా ఇళ్లకు కొత్త విద్యుత్ కనెక్షన్లను ఇస్తున్నారు. ఒక్కో ఇంటికి విద్యుత్ సామగ్రి ఏర్పాటుకు కనిష్టంగా రూ. 50 వేల నుంచి గరిష్ఠంగా రూ.2.50 లక్షల వరకు అవుతుంది. ఎలక్ట్రిషియన్లు, యజమానుల మధ్య కమీషన్ల సంబంధాలు ఉండటంతో తీగలు, స్విచ్‌లు, బల్బులు, ఫ్యాన్లు, ఎగ్జాస్టర్లు తదితరాలను లోకల్, నాసిరకం వాటినే కొంటున్నారని విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు. ఒకవేళ తా వే ం కొంటామంటూ ఎవరైనా ఇళ్ల యజమానులు చెబితే... ఫలానా దుకాణంలో తక్కువ ధరకు దొరుకుతాయని సూచిస్తుండటంతో అక్కడికే వెళుతూ మోసపోతున్నారు.ఇక ఇటీవల అపార్ట్‌మెంట్‌ల సంస్కృతి విపరీతంగా పెరగడంతో అంతా సిద్ధమైన ఫ్లాట్లను కొంటున్నారు. వాటిని నిర్మిస్తున్నవారు లాభాల కోసం పైకి కనిపించే స్విచ్‌లు, వాటి బోర్డుల ను నాణ్యమైనవి బిగిస్తూ లోపల తీగలు లోకల్‌వి వాడే ప్రమాదముందని ఇలాంటి వాటి విషయం లో జాగ్రత్తగా ఉండాలని ఇంజినీర్లు సూచిస్తున్నారు.

**ధర తక్కువంటూ.. బురిడీ**

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రముఖ కంపెనీ ఫ్యాన్‌ను రూ.1,700కి విక్రయిస్తామని దుకాణ యజమాని చెప్పారు. దాని కింద అదే పేరును తలపించేలా ఉన్న స్థానికంగా తయారైన దాన్ని రూ.1100కి ఇస్తామని తెలిపారు. ఇవి ఇక్కడే లభ్యమయ్యే పరికరాలతో తయారైనందునే ధర సగం తగ్గుతుందని తెలిపారు. పైనున్న దానికి ఐఎస్ఐ మార్కు ఉండగా.. కింది దానికి ఐఎస్ఐ మార్కు లేకపోవడం గమనార్హం. అలాగే ప్రముఖ కంపెనీకి చెందిన 10 వాట్ల ఎల్ఈడీ బల్బ్‌ను రూ.280కి ఇస్తామని దుకాణ యజమాని తెలిపారు. పక్కనే దాన్ని పోలిన పేరుతో ఉన్న 30 వాట్ల ఎల్ఈడీ బల్బ్‌ను రూ.80కే ఇస్తామన్నారు. రెండూ ఒకేలా వెలుగునిచ్చినా... రెండోది ఎంత కాలం పనిచేస్తుందనే గ్యారంటీ ఇవ్వలేమన్నారు.

**అత్యంత కీలకం సీఈఏ నిబంధనలు..**

ఇళ్లు, కార్యాలయాలు, ఇతరచోట్ల విద్యుత్ సామగ్రిని బిగించడానికి తప్పనిసరి పాటించాల్సిన నియమాలను 2023 కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) జారీ చేసింది. భారత జాతీయ భవనాల కోడ్ (ఎన్‌బీసీ-2016), భారత జాతీయ విద్యుత్ కోడ్ (ఎన్ఈసీ-2023) ప్రకారం వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కానీ, ఇళ్లలో పనిచేసే ఎలక్ట్రిషియన్లకు అసలీ నియమాలే తెలియదని విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు.విద్యుత్ దీపాలు వెలిగే పాయింట్ వరకు 1.5 చదరపు మిల్లీ మీటరు (చ.మి.మీ.), విద్యుత్ ప్లగ్‌లు పెట్టే పవర్ పాయింట్ల వరకు 2.5. ఏసీ తదితర అధిక విద్యుత్ అవసరమయ్యే సామగ్రి పవర్ పాయింట్ వరకు 4 చ.మి.మీ. విద్యుత్ తీగలను వినియోగించాలి.కానీ, చాలామంది ధరల విషయంలో రాజీ పడుతున్నారు. ఈ కారణంగా తీగలకు సరఫరా అయ్యే కరెంటు లోడ్‌లో తేడాలొచ్చి గృహోపకరణాలు కాలిపోతాయి. ఒక్కోసారి మంటలు వచ్చి అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. షాక్ తగిలి ప్రాణాలు కూడా పోతాయి. పైగా ఏళ్ల తరబడి వాటిని పనితీరును పట్టించుకోరు. విద్యుత్ సామగ్రి బిగింపు పనులను లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్లు, ఐటీఐలో ఎలక్ట్రిషియన్ కోర్సు ఉత్తీర్ణులైన మెకానిక్‌లతోనే చేయించాలి.కానీ, ఇళ్లలో విద్యుత్ పనులు చేసే అత్యధిక శాతం మెకానిక్‌లకు అసలు ఎలాంటి అర్హతలు ఉండవు. ఎక్కడో, ఎవరో చేస్తున్న పనులను చూసి, నేర్చుకున్నవారే అధికంగా ఉంటారు.

# నార్మ్‌లో రహదారి మూసివేత

## -ఎంపి లేఖ బేఖాతర్, ఎమ్మెల్యే చెప్పినా పెడచెవిన పెట్టిన వైనం




అత్తాపూర్ జనవరి 6,ప్రభాతావర్త : రాజేంద్రనగర్ నార్మ్‌లో అప్రకటిత రహదారి మూసివేతకు కారణం బీరు బాటిళ్లు విసిరేయడం, ద్విచక్రవాహనాల పై వస్తున్న యువతే కారణమని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ తేల్చారు. లోపాలను సరిదిద్దాల్సిన అధికారులు అప్రకటితంగా రహదారి మూసి వేత ఎంత వరకు సరైనది కాదని, స్థానికంగా ఉండే మీడియా ప్రతినిధులను కూడా లోపలి రహదారి గుండా అనుమతించడం లేదని ప్రశ్నించగా ఆయన వదిలే ప్రసక్తేలేదన్నారు. ఆ పక్కదారి గుండా పోవాలని బహిరంగంగా చెప్పారు. అంతేందుకు రాష్ట్ర పోలీస్ శాఖకు చెందిన డిప్యూటీ కమీషనర్ వాహనాన్ని కూడా సోమవారం రాత్రి అటుగా అనుమతించకపోవడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పేరుతో నిజంగా రాజేంద్రనగర్ ప్రాంతాన్ని గడీలలో బంధించే ప్రక్రియ ప్రారంభం అయిందని స్పష్టమవుతుంది. దీని పై రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన వాహనాలను అనుమతింకపోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర డిజిపితో పాటు సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక అసలు విషయానికి వస్తే ఇటీవల ఓ సైటీస్ట్ నార్మ్ గెస్ట్ వద్ద తాగిన మైకంలో హంగామ సృష్టించారని దాంతో పాటు నార్మ్ పరిసరాలలో కొన్ని బీరు బాటిళ్లు కనిపించడంతో నాటు బైకుల పై యువకులు హస్టళ్లు, గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో తిరుగుతుండడాన్ని గమనించిన డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటూ, స్వయంగా రాత్రిళ్లు ప్రస్తుతం అప్రకటిత మూసివేసిన గేట్ల వద్ద కూర్చోని స్వీయ పరిశీలనతో కూడిన పర్యవేక్షణ చేస్తున్నట్లుగా సమాచారం. పాపం భద్రత సిబ్బంది ఏం చేస్తారు డైరెక్టర్ ఆదేశాలతో పాటు స్వీయ పరిశీలనతో కూడిన పర్యవేక్షణతో వారు విధులు నిర్వహించడానికి ఒనికిపోతున్నారని తెలుస్తుంది. 1976 రాజేంద్రనగర్ లోని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం భూముల్లో కేంద్ర ప్రభుత్వం జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థను ఏర్పాటు చేసింది. ఇది మన భారత దేశానికి అవసరమైన సంస్థ కావడం మన ప్రాంతంలో ఉండడాన్ని స్థానికులు గర్వంగా భావిస్తుంటారు. లోపాలను సరిదిద్దుతూ విద్యార్థినీ, విద్యార్థుల కోసం భద్రత చర్యలు పెంచాల్సిన అధికారులు ఏకంగా గేట్లు మూసి వేసేయడం అర్థం కావడం లేదు. ఇక్కడేమైన నిషేధిత కార్యకళాపాలు జరిగాయా..? లేక సంస్థ భద్రత కోసమే గేట్లు మూసి వేసి ఉంటే అది వర్కింగ్ సమయాల్లో కూడా అమలులోకి తీసురావాల్సినంత అత్యవసర పరిస్థితులు ఏమైనా ఏర్పడ్డాయా అన్న కోణం గోచరిస్తుంది. గేట్ల మూసి వేతకు, గెస్ట్ హౌస్, విద్యార్థుల హస్టళ్లకు సంబంధం లేదని చెప్పాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నార్మ్ లోకి ప్రవేశించే ప్రధాన గేటు పరిపాలన భవనం సమీపం మీదుగా వెలుతుంది. గేటు వద్ద, పరిపాలన భవనం, ఆ పాయింట్లో భద్రత సిబ్బంది ఎప్పుడు అలర్ట్ గానే ఉంటారు. ఇక అక్కడి నుంచి హస్టల్ వైపు, గెస్ట్ హౌస్ వైపు అకతాయిలు వెళ్లే అవకాశం సాధ్యమైనంత వరకు లేదనే చెప్పాలి. అలాగే నార్మ్ పరిపాలన భవన సమీపంలోని సెక్యూరిటీ పాయింట్ నుంచి నేరుగా వెళ్లి కూడి వైపు మళ్లుతూ కొద్ది దూరంలో ఎడమ వైపు తిరిగే ఈ ప్రధాన రహదారికి రెండవ గేటు ఎన్ఐఆర్, రాజేంద్రనగర్ తహశీల్దార్ కార్యాలయానికి అనుకుని ప్రహరీ ప్రక్కనే ఉంటుంది. ఇక ఎక్కడి నుంచి అసాంఘిక శక్తులు, అకతాయిలు ప్రవేశించడానికి వీలు లేదనేది ఇక్కడ చెప్పకనే అర్థమవుతుంది. అధికారులు గుర్తించిన, జరిగిన సంఘటన నేపథ్యంలో కొంత భద్రత సిబ్బంది లేదా, చర్యలను పెంచితే సరిపోతుంది. అలాంటి చర్యలు తీసుకోని అధికారులు గడీలో రాజేంద్రనగర్ ప్రాంతాన్ని బంధిస్తామంటే ఏలా అని స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఐటి కారిడార్‌లో రోడ్డు ప్రమాదం ...యువకుడు మృతి

**గచ్చిబౌలి, జనవరి 6 ప్రభాతవార్త :** ఐటి కారిడార్‌లో అర్ధరాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇన్స్‌పెక్టర్ బాలరాజు కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బామ్దా జిల్లా అత్తారా గ్రామానికి చెందిన సూరజ్ సింగ్(23) ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చాడు. గౌలిదొడ్డిలోని స్టే హోటల్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తు, హోటల్ అవరణలోనే నివాసం ఉంటున్నాడు. కాగా సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో సూరజ్ తన బైక్ (టిఎస్09 ఎఫ్ఆర్3420) మీద గౌలిదొడ్డి నుంచి విప్రో సర్కిల్ వైపు బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమద్యలో వర్చుసా మెయిన్ గేటు ముందు సూరజ్ సింగ్ ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు మాద్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరజ్ కిందపడగా, అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని గాయపడిన సూరజ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూరజ్ ఉదయం 8.30గంటలకు మృతి చెందాడు. దీంతో విషయాన్ని జీడిమెట్లలో ఉంటున్న సూరజ్ సోదరుడికి సమాచారం అందజేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఈమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## భారతీయ శాస్త్రీయ నృత్యకళలు భావితరాలకు అందించాలి




నృత్యసమాహారంలో ప్రదర్శనలిచ్చిన కళాకారిణులతో వాణిరమణ, పద్మకళ్యాణ్ తదితర అతిథులు

**నాంపల్లి, జనవరి 6 ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ నృత్యకళలు అతిప్రాచీనమైనవని, వాటిని భవిష్యత్తు తరతరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ప్రముఖ విద్వాంసురాలు వాణిరమణి అన్నారు. గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో బొగ్గులకుంట, తిలక్‌రోడ్ తెలంగాణ సార స్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో కూచిపూడి నృత్యసమాహారం వైభవంగా జరిగింది.ఈకార్యక్రమానికి అతిదిగా హాజరైన వాణిరమణ మృదంగ విద్వాంసులు పాలకుర్తి రామ చంద్రశర్మ, పద్మకళ్యాణ్, బి.ఉదయ్‌కుమార్ తదితరులతో కలిసి జ్యోతిప్ర కాసనంచేసి నృత్యసమాహారంను ప్రారంభించి మాట్లాడారు.తెలుగు సంస్కృతి సంప్రదాయాలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంత రం కూచిపూడి నృత్యసమాహారంలో భాగంగా కళాకారులు ఎంఎస్‌వి.హేమ లత, కె.రమ్య రెడ్డి, నిత్యవైష్ణవి, నాగమణి, ఈష, టి.వైష్ణవి, ఎస్.హనీష,జి. శాన్విక, ఆరాధ్య,అన్విత‌లు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆహుతులను అలరించాయి.

# జిహెచ్‌ఎంసికి కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు

-డెంగ్యూ, ఇతర వ్యాధుల నియంత్రణ చర్యలకు దేశవ్యాప్త గుర్తింపు
-నాగ్‌పూర్‌లో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్స్ జాతీయ సమావేశం
-జిహెచ్‌ఎంసి విధానాలను వివరించిన కమిషనర్ ఆర్.వి.కర్ణన్




నాగ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా తదితరులు

హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త: దోమలు సహా కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణలో హైదరాబాద్ నగరం సాధించిన పురోగతికి కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు అందించింది. నాగ్‌పూర్‌లో నిర్వహించిన మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్స్ (ఎంఎస్‌యుఎస్) జాతీయ సమీక్షా సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చర్యలను కేంద్ర అధికారులు అభినందించారు.ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ 2025 సంవత్సరంలో డెంగ్యూ కేసులను హైదరాబాద్ ఎలా గణనీయంగా తగ్గించిందో వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వెక్టర్ బోర్న్ డిసీజెస్ (విబిడి) యాప్ ద్వారా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసిన విధానాన్ని ఆయన ప్రస్తావించారు. జీఐఎస్ ఆధారిత డ్యాష్‌బోర్డులు, రియల్‌టైమ్ డేటా అప్‌డేట్స్‌తో క్షేత్రస్థాయిలో వెంటనే చర్యలు తీసుకోవడంతో ఇది సాధ్యమైందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డేటా ఆధారిత విధానం, శాఖల మధ్య సమన్వయంతో చేపట్టిన చర్యలు ఫలప్రదంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు హైదరాబాద్ అనుసరించిన నమూనా ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించింది. ఈపర్యటనలో కమిషనర్ వెంట ఛీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా తదితరులు ఉన్నారు.

## బ్యాంకుల ప్రైవేటీకరణ వినాశకరమైన ఆలోచన : బి.ఎస్.రాంబాబు




ప్రభుత్వ బ్యాంకులను రక్షించుకుందాం అంటూ సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న ఏఐబిఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు,

హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త

దేశంలో ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ వినాశకరమైన ఆలోచన అని, కేంద్రంలోని ఫాసిస్ట్ మోదీ ప్రభుత్వం దీనిని వెంటనే విరమించుకోవాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబిఈఏ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్ చేసారు. మంగళవారం కోఠి, సెంట్రల్ బ్యాంకు వద్ద "ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకుందాం- దేశాన్ని రక్షించుకుందాం" అన్న నినాదంతో చేపట్టిన కెనరా బ్యాంకు ఉద్యోగి జి.ఉమామహేష్ జనజాగృతి సైకిల్ యాత్రను ఏపీ,టీజీ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏపిటిబిఈఎఫ్) అధ్యక్షులు టి.రవీంద్రనాథ్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సాహసోపేతమైన అడుగు సామాన్యులకు బ్యాంకింగ్ సేవల ద్వారాలను తెరిచిందని, అప్పటి వరకు, బ్యాంకింగ్ రంగం చాలా తక్కువ మంది సంపన్నులకు మాత్రమే అందుబాటులో ఉండేదని, బ్యాంకుల జాతీయకరణ తరువాత పేద రైతులు, మహిళలు, చిన్న వ్యాపారులు, రోజువారీ వేతనాల వారు మరియు అణగారిన సమాజంలోని అన్ని వర్గాలు ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారని గుర్తు చేసారు. అదానీ, అంబానీల వంటి కార్పొరేట్లకు నమ్మకమైన మిత్రుడు ప్రధాని మోదీ కేవలం వారి లబ్ది కోసమే ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను ముందుకు నెడుతున్నాడని అన్నారు. దేశంలో చాల ప్రైవేట్ బ్యాంకుల్లో నిధుల దుర్వినియోగం జరిగి, కుప్పకూలిన సంఘటనలు అనేకం జరిగి, ప్రజల సొమ్ము లూటీ అయ్యాయని, కేవలం ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కష్టపడి సంపాదించిన ప్రజల పొదుపు భద్రంగా ఉంటుందని చెప్పారు.ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకునేందుకు ప్రజలను భాగస్వామ్యం చేసి భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమిస్తామని అయన హెచ్చరించారు. యాత్రను ప్రారంభించిన టి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు ప్రయోజనాలను చేకూర్చే ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయడం బదులు వాటిని ప్రైవేటీకరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే కేంద్ర బీజేపీ ప్రభుత్వ ఉద్దేశం దీర్ఘకాలంలో ప్రజా సంపద నష్టానికే దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఏపిటిబిఈఎఫ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వి. కృష్ణ రావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, పి. ఉదయ్ భాస్కర్, మధుసూదన్, అజయ్, సంయుక్త కార్యదర్శి నల్లపు రెడ్డి, ఏఐబిఓఏ సంయుక్త కార్యదర్శి బిఎస్ఆర్, నాయక్, ఏపిటిబిఈఎఫ్ నేతలు జానకిరామ్, నిహారిక, సాయి వాణి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

-రూ.50లక్షల విలువైన 17 ఖరీదైన బైకులు స్వాధీనం



నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న ఏసిపి తదితరులు

గచ్చిబౌలి, జనవరి 6 ప్రభాతవార్త

పార్కు చేసి ఉంచిన ఖరీదైన బైకులను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 50లక్షల రూపాయల విలువైన మొత్తం 17 బైకులను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బైకులని తెలిసి సైతం వీరి వద్ద వాహనాలు కొనుగోలు చేసిన మరో ఇద్దరి మీద సైతం పోలీసులు కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మంగళవారం గచ్చిబౌలి ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదాపూర్ ఏసిపి శ్రీధర్ వెల్లడించారు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన సంతోష్ దాస్(19) నగరానికి వచ్చి మియాపూర్ న్యూ కాలనీలో నివాసం ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. ఇతను గతంలో శంషాబాద్, ఆర్‌జిఐ పోలీస్ స్టేషన్, చిట్యాల తదితర ప్రాంతాల్లో వాహనాల చోరీలకు పాల్పడి అరెస్టయ్యాడు. జైలు నుంచి విడుదలైన తరువాత సైతం తన చోరీలను కొనసాగించాడు. ఇతనికి గుంటూరు నుంచి వచ్చి నిజాంపేటలో నివాసం ఉంటున్న బెజ్జంకి మణికాంత(20), రాజమహేంద్రవరం నుంచి వచ్చి నిజాంపేటలోనే ఉంటున్న లోకేష్ వర్మ(24)లు స్నేహితులయ్యారు. కొన్నిరోజుల తరువాత వీరు సైతం సంతోష్ దాస్ ఉంటున్న ఇంటికి మారిపోయారు. అనంతరం ముగ్గురు కలిసి సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించారు. గతకొంత కాలంగా సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల లిమిట్స్‌లో ఇళ్ల ముందు పార్కు చేసి ఉంచిన ఖరీదైన బైకులను చోరీ చేశారు. గచ్చిబౌలిలో బైకు దొంగతనాలపై పిర్యాదు అందుకున్న పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కొండాపూర్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు చేసిన నేరం అంగీకరించారు. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 ఖరీదైన బైకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా చోరీ చేసిన బైకులను వీరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న నక్కా హేమంత్, సాయిరాం అనే వ్యక్తుల మీద సైతం పోలీసులు కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బైకుల విలువ దాదాపు 50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ బాలరాజు, డిఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలపై సర్వే



ఏఓసి సెంటర్ కారిడార్ నిర్మాణం పై సర్వే చేస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**కంటోన్మెంట్,జనవరి 6 ప్రభాతవార్త:** హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మంగళవారం మారేడ్‌పల్లి మండల పరిధిలోని ఏఓసి సెంటర్ ఆర్మీ రోడ్లు, తిరుమలగిరి మండలంలోని ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ స్థలాలను పర్యవేక్షించారు. మల్కాజిగిరి జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్,సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, డిఫెన్స్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సికింద్రాబాద్ ఏఓసి సెంటర్ అలహాబాద్ గేట్ నుంచి ఆర్.కె.పురం గేట్ వరకు మిలటరీ ఆర్మీ ఏరియాలో 5.2 కిలో మీటలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు సర్వే నిర్వహించారు. 1.50 కిలో మీటర్ పరిధిలోని హైదరాబాద్ జిల్లా పరిధి ఉన్నందు వల్ల మిలటరీ ఆర్మీ రోడ్లలో సివిలియన్స్‌ను అనుమతించకపోవడం వల్ల ప్రత్యామ్నాయంగా సికింద్రాబాద్ ఏఓసి సెంటర్ నుంచి ఆర్.కె.పురం చౌరస్తా వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు సర్వే నిర్వహించారు.ఈ నెల 8 నుంచి రక్షణ శాఖ, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి సంయుక్త ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందని ఆర్‌డిఓ సాయిరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహశీల్దార్ ఎండి అసదుల్లాఖాన్, సర్వేయర్ శ్రీనివాస్ చారి, తిరుమలగిరి తహశీల్దార్ బిక్షపతిలు పాల్గొన్నారు.

## దొమ్మాట వెంకటేష్ గ్రంథాన్ని ఆవిష్కరించిన సిఎం




పాత్రికేయుడు దొమ్మాట వెంకటేష్ రాసిన "హోప్ ఆఫ్ ది నేషన్" గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త

అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయుడు దొమ్మాట వెంకటేష్, రాహుల్ గాంధీ సామాజిక న్యాయతత్వం-కార్యాచరణపై రాసిన "హోప్ ఆఫ్ ది నేషన్" గ్రంథాన్ని సిఎం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, గ్రంథ రచయిత దొమ్మాట వెంకటేష్, సీనియర్ పాత్రికేయులు కడెంపల్లి వేణుగోపాల్‌గౌడ్, అంబటి సురేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేసే ఇలాంటి పుస్తకాలు ఆవిష్కరణలు కొనసాగాలని ఆకాంక్షించారు.

## దొంగతనాల నివారణకు పోలీసుల విజ్ఞప్తి

**నిజాంపేట్, జనవరి 6, ప్రభాతవార్త**

ఇంటిలో విలువైన వస్తువులు అనగా డబ్బులు, బంగారం, వెండి ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని బాచుపల్లి పోలీసులు సూచించారు. ఇంటి ముందు తలుపులకు, ప్రధాన ద్వారాలకు సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో పాటు, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్లు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలను ఇంటి లేదా హాస్టల్ పార్కింగ్‌లోనే నిలిపాలని, చక్రాలకు, చైన్, సెంట్రల్ లాక్ సిస్టమ్ అమర్చుకోవాలన్నారు. టూ వీలర్లకు, ఫోర్ వీలర్లకు జిపిఎస్ ట్రాకర్‌ని అమర్చుకోవాలని, సోషల్ మీడియాలో ప్రయాణపు తాలూకు వివరాలను స్టేటస్‌గా పెట్టొద్దని తెలిపారు. మీ ఇరుగు పొరుగు వారిని మీ ఇంటిపై ఒక కన్ను వేసి ఉంచమని చెప్పాలన్నారు. ముందుగానే పేపర్ బాయ్‌ని, పాలు వేసేవారిని రావద్దని చెప్పాలన్నారు. ప్రధాన ద్వారానికి వేసిన తాళాలు కనపడకుండా కర్టెన్స్ వేయాలన్నారు. ప్రధాన ద్వారంతో పాటు కిటికీల తలుపులు విధిగా వేయవలెనని, ఏదైనా ఒకగదిలో లైటు వేసి వుంచాలన్నారు. ఇంటికి సి.సి కెమెరాలను అమర్చుకుని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షి స్తూ ఉండాలని, మీరు ఊరికి వెళ్ళే విషయాన్ని అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. అనుమానితులు ఎవరైనా మీ కాలనీలో తిరుగుతున్న ఏదైనా అత్యవసర సమయములో బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన



విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రవాణశాఖ అధికారి సాధుల శ్రీనివాస్

**పేట్ బషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన ఎంతో అవసరమని రవాణశాఖ అధికారి రఘునందన్ గౌడ్ తెలిపారు. మంగళవారం కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై ఆర్టిఏ అధికారులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సడక్ సురక్ష జీవన్ రక్ష అనే ప్రచార సందేశంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవాణశాఖ అధికారి రఘునందన్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్టులు ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. ముఖ్యంగా వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడకూడదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. రాంగ్ రూట్‌లో వెళ్లడం, అతివేగం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. బహుమతులు అందుకున్న సీనియర్ విద్యార్థులు కె. మానస, షిఖపాండే, వై.జెషిక, ఎస్.పి.హాసిని జూనియర్లు ఎ.కుందన్, కె.దీక్షిత, పి.భార్గవ్. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌లు సాధుల శ్రీనివాస్, ఎం.ఆర్.శిల్ప, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రావల్ బ్రాహ్మణ సమాజానికి బేగంపేటలో స్వాగతం



బేగంపేట రైల్వేస్టేషన్ లో రావల్ బ్రాహ్మణ సమాజానికి చెందిన వారికి స్వాగతం పలుకుతున్న బీజేపీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ తదితరులు.

**బేగంపేట జనవరి 6,ప్రభాతవార్త**

శ్రీశైల మల్లిఖార్జున జ్యోతిర్లింగ యాత్రలో భాగంగా బేగంపేట రైల్వేస్టేషన్ లో రావల్ బ్రాహ్మణ సమాజానికి చెందిన రాజస్థాన్, గుజరాత్,మహారాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 300మంది భక్తులకు మంగళవారం బేగంపేట రైల్వేస్టేషన్ లో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ విజయ్ కుమార్,శ్రావణ్‌కుమార్ తదితరులు యాత్రికులకు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రావల్ బ్రాహ్మణ సమాజ పెద్దలు దినేష్ రావల్,సురేష్ రావల్,మదన్‌లాల్ రావల్,గౌతమ్ రావల్, సంజీవ్ రావల్,ఆనంద్ రావల్,మహేష్ రావల్ పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ కమిటీని నియమించాలి

**-తెలంగాణ విద్యుత్ బిసి, ఒసి ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి**




సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కుమారస్వామి, కన్వీనర్ వెంకన్నగౌడ్, కోకన్వీనర్ భానుప్రకాశ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త:**

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థలలో ఉన్న బీసీ, ఒసి ఉద్యోగుల సమస్యలు తీర్చాలని తెలంగాణ విద్యుత్ బీసీ, ఒసి ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, చైర్మన్ కోడెపాక కుమారస్వామి, కో కన్వీనర్ సి. భాను ప్రకాష్ లు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ కమిటీని నియమించి ఏప్రిల్ నుండి నూతన వేతనాలు అందించాలన్నారు. అలాగే 1999 2004 మధ్యలో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చెయ్యాలని,విద్యుత్ ఉద్యోగులకు అపరిమిత మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్టిజన్ ఉద్యోగులకు వారి విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని, మరి కొన్ని తమ న్యాయమైన డిమాండ్లను విద్యుత్ యాజమాన్యాలు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టిఎస్ జెన్‌కో ఎండీ హరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు యాదగిరి, విజయ్ కుమార్,మురళి, అశోక్ కుమార్, శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

**నేరేడ్‌మెట్, జనవరి 6,ప్రభాతవార్త :** చెట్టుకు ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సెక్టార్ ఎస్ ఐ సాయి అవినాష్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో సఫిల్ గూడ మినీ ట్యాంకు బండ్ వద్ద ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డు బండి ప్రసాద్ నేరేడుమెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు అని తెలిపారు. మృతుడు సుమారు 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మూగ వ్యక్తిగా గుర్తించారు. గడ్డం ధరించి, బట్టతలతో ఉన్న మృతుడు నలుపు రంగు షర్టు, తెలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు అని అన్నారు. సంఘటనా స్థలంలో పరిశీలన చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్కు తరలించారు. మృతుడి పాయింట్ జేబులో ఈ నెల నాలుగో తేదీన కర్ణాటక రాష్ట్రంలోని గౌరీ బీదనూర్ నుంచి కాచిగూడ వరకు ప్రయాణించినట్లు తెలిపే రైల్వే టికెట్ లభ్యమైంది. మృతుడి గుర్తింపు, చిరునామా వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఇతనికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# అంతరాయం లేని నీటి సరఫరా కోసం జలమండలి చర్యలు

-పైప్‌లైన్ నెట్‌వర్కింగ్‌తో పాటు రింగ్ మెయిన్ ఏర్పాట్లు
-ఓఆర్ఆర్‌కు ఆనుకొని పైప్‌లైన్ ఏర్పాటు
-రూ. 8కోట్లతో భారీ ప్రాజెక్టుకు కసరత్తు

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:**

మహానగర ప్రజల దాహార్తి తీర్చడం కోసం జలమండలి అధికారులు అత్యుత్తమైన ప్రణాళికను సిద్ధం చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు అంతరాయం లేని నీటి సరఫరాను కొనసాగించడం కోసం జలమండలి భారీ కార్యచరణ సిద్ధం చేస్తోంది. కొన్ని కారణాల వల్ల నగర ప్రజలు తాగునీటికి తరచూ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు అప్పుడప్పుడు పగిలిపోవడం వల్ల మరమ్మతుల కోసం నీటి సరఫరాను నిలిపివేయాల్సి వస్తోంది. మరమ్మతులు పూర్తయ్యే వరకు నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడి జలమండలి నగర ప్రజలను ఇబ్బందులకు గురిచేయాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో అధికారులు ఎప్పటికప్పుడు మార్గాలను అన్వేసిస్తూనే ఉన్నారు. తాజాగా రింగ్ మెయిన్ పేరిట అత్భుతమైన పరిష్కారాన్ని అమలు జరిపేందుకు కృషి చేస్తున్నారు. దీంతో పాటు పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను అమలు జరిపేందుకు సిద్ధమయ్యాయరు.

**అంతరాయం లేని నీటి సరఫరా కోసం.....**

ఎలాంటి అంతరాయం లేని నీటి సరఫరాను నగర ప్రజలకు అందజేయాలనే లక్ష్యంతో జలమండలి చర్యలు చేపట్టింది. ఇందుకోసం మహానగరం చుట్టు దాదాపు 96 కిలోమీటర్ల పరిధిలో పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాట్లు జరుపుతున్నారు. దీంతో పాటు దాదాపు 150 కిలోమీటర్ల మేర సింగూరు, మంజీరా, ఉస్మాన్ సాగర్, కృష్ణా, గోదావరి, హిమాయత్‌సాగర్‌లను అనుసంధానం చేస్తూ రింగ్ మెయిన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఓఆర్ఆర్‌కు ఆనుకొని రింగ్ మెయిన్‌ను ఏర్పాటు చేసి నగరానికి అంతరాయం లేని నీటి సరఫరా కోసం వివిధ ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ భారీ ప్రాజెక్టు కోసం జలమండలి దాదాపు 8వేల కోట్లను ఖర్చు చేయనుంది. ప్రస్తుతం జంటనగరాలకు తాగునీరు అందిస్తున్న కృష్ణా, గోదావరి నీటిని తీసుకువచ్చి శుద్దిచేసి సరఫరా చేస్తున్నారు. చేపట్టనున్న ప్రాజెక్టు పనులు పూర్తయితే పలు జల వనరుల నుంచి నగరానికి అంతరాయం లేని తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుంది. నగానికి తాగునీటి అవసరాల కోసం ఉస్మాన్‌సాగర్ లాంటి జలాశయాల నుంచి నీటి సరఫరా జరిగేది. నగరం విస్తరిస్తుండడంతో పెరుగుతున్న జనాభా అవసరాలకు తాగునీరు సరిపడకపోవడంతో నీటి అవసరాల కోసం అప్పట్లో మంజీరా, సింగూరు జత చేశారు. అయినప్పటికి పెరుగుతున్న జనాభా అనుగుణంగా నీటి సరఫరా లోపించుండడంతో ప్రత్యామ్నయ మార్గాలను అన్వేషించారు. కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకుని శుద్ది చేసి సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా మంజీరా పైప్‌లైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. కృష్ణా, గోదావరి పైప్‌లైన్లకు అటంకం ఏర్పడినా, ఇతర సమస్యలు ఎదురైనా అంతరాయం తప్పడం లేదు. దీంతో నగర ప్రజలు నీటి అవసరాలు తీరడం కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాడుకనీటి అవసరాలు తీరుతున్నప్పటికి తాగునీటికి మాత్రం కటకట తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అంతరాయం లేని తాగునీటి అవసరాలు తీర్చడం కోసం జలమండలి అధికారులు రింగ్ మెయిన్‌పై దృష్టి సారించారు. అధికారుల అంచనాలు పూర్తి చేస్తుందని అధికారులు భావిస్తున్నారు. మరో రెండు, రెండున్న సంవత్సరాల కాలంలో రింగ్ మెయిన్ పూర్తి చేయడం అవసరమని అధికారులు భావిస్తున్నారు. అలాగే గోదావరి 2,3 దశలు అందుబాటులోకి వస్తుండడంతో రింగ్ మెయిన్ ద్వారా అనుసంధానం చేస్తే నీటి అవసరాలు తీర్చడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

## ప్లాస్టిక్‌ను నివారించాలని డిప్యూటి కమిషనర్‌కు వినతి



ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని డీసీకి వినతిపత్రాన్ని అందిస్తున్న బద్దం కొండల్‌రెడ్డి,

**శేరిలింగంపల్లి,జనవరి 6 పభాతవార్త :** ప్రాణాంతకంగా మారిన ప్లాస్టిక్‌వాడకాన్ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మదర్‌సేవా సమితి ట్రస్టు ఛైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్, మియాపూర్ ఏసీపీ, మియాపూర్ డిప్యూటి కమిషనర్, ఆయా విభాగాల అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వివిధ కూరగాయల మార్కెట్ల వద్ద, హోటళ్లు, ఫంక్షన్‌హాల్స్ లలో ప్లాస్టిక్ వాడకం అధికంగా ఉందని, మానవాళి మనుగడకు యమపాశంగా, మనుషులను కబళిస్తున్న ప్లాస్టిక్‌వాడకాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ సముద్రజలాలలోనూ, చెరువుల్లోనూ, నాళాలలోనూ ప్లాస్టిక్ పదార్థాలు చేరి భూభాగాన్ని కాలుష్యనగరాలుగా, మార్చి వేస్తున్న ఈ ప్లాస్టిక్ నివారణ కోసం కృషిచేయటానికి ప్రతి ఒక్కరూ కంకణబద్దులుకావాలన్నారు. ప్రధానంగా శేరిలింగంపల్లి కూరగాయల మార్కెట్, తారానగర్, పాపిరెడ్డి నగర్, రాజీవ్‌గృహకల్ప,కొండాపూర్, కొత్తగూడ, రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వర నగర్, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, మదీనాగూడ, మియాపూర్. పాత హాఫీజ్‌పేట్, మార్తాండనగర్ తదితర మార్కెట్ల వద్ద, కిరాణా షాపుల్లో, హోటళ్లు, టిఫెన్ సెంటర్లు వద్ద ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా జరుగుతుందన్నారు. దీంతో మనిషులకు క్యాన్సర్,ఇతర రోగాలు వస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పశువులు ప్లాస్టిక్ వస్తువులు తినడంతో ఎన్నో మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయన్నారు. నగర వాతావారణం కాలుష్యంతో నిండిపోతుందని,దీనికి తోడు ప్లాస్టిక్ వాడకం పెరటంతో మరిన్ని రోగాలు వస్తున్నాయన్నారు. బిహెచ్ఈఎల్,కూకట్‌పల్లి రైతుబజార్ మార్కెట్లలో పగడ్బందీగా ప్లాస్టిక్ నివారణ చర్యలు తీసుకుంటున్నారని, అదే విధంగా అధికారులు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కూడా కొనసాగించాలని ఆయన కోరారు. గతంలో తాము అధికారులకు, పోలీస్ వారికి ప్లాస్టిక్ వాడకం నివారణకై పలుమార్లు ఫిర్యాదులు చేయటం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్‌లో ప్లాస్టిక్ నివారణ కోసం పకడ్బంధీగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందనా్రు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పార్టీ పటిష్టానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : డా.కోట నీలిమ



కోట నీలిమను సత్కరిస్తున్న బేగంపేట కాంగ్రెస్ నేతలు.

**బేగంపేట జనవరి 6,ప్రభాతవార్త**

బేగంపేట డివిజన్ లో పార్టీ పటిష్టానికి ప్రతి ఒక్కరూ ఒక్క తాటిపైకి వచ్చి రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ పిలుపు నిచ్చారు.బేగంపేట డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ గౌస్,అభిషేక్ అడపా,సి.రాజేందర్ తదితరుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కోట నీలిమ ను కల్సి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా వారు దుశ్శాలువాతో సత్కరించి,పూలగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా తనను కల్సిన కాంగ్రెస్ నాయకులతో కోట నీలిమ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని,త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పూర్తి మద్దతు తెలియజేసి విజయాన్ని అందించాలని కోరారు.ప్రతి నాయకుడికి,కార్యకర్తకు న్యాయం జరిగే విధంగా పార్టీ తరుపున తాను సహాయ సహకారాలు అందించేందుకు అన్ని వేళలా ముందుంటానన్నారు.అలాగే అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించడంలో తమ వంతు వారికి సహకరించాలన్నారు.ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ గౌస్,అభిషేక్ అడపా,సీ.రాజేందర్, హనీఫ్‌ఖాన్,మునీర్‌ఖాన్, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బిఆర్ఎస్ పోరాటం

**- మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి**




మణికొండ డివిజన్‌లోని డాలర్‌హిల్స్, పాషా కాలనీల్లో మీ సమస్య-మాబాధ్యత కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు.

**నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం మణికొండలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, ఉపేంద్రనాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మణికొండలోని డాల్‌హిల్స్, పాషాకాలనీ పరిసర ప్రాంతాలలో చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు వచ్చి ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ఆటోలకు పెద్ద ఎత్తున నష్టం వస్తుందని, తీసుకున్న ఫైనాన్సులను సకాలంలో చెల్లించలేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. వివిధ కంపనీలలో పని చేస్తున్న కార్మికులు ఇన్సూరెన్స్, పిఎఫ్ సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, కార్పెంటర్లు, మేస్త్రీలకు స్థానిక వర్కర్లతో సమానంగా కూలీ డబ్బులు ఇవ్వడం లేదని, సమాన పనికి సమాన డబ్బులు ఇవ్వకుండా బేదాలు చూపిస్తున్నారని బిఆర్ఎస్ నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాం, ఉపేంద్రనాథ్‌లు మాట్లాడుతూ ఉచిత బస్సు పతకంతో ఆటో డ్రైవర్లు ఫైనాన్సులు కట్టలేక నరకయాతన పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలు తొలగించేందుకు బ్యాంకర్లతో మాట్లాడి ఫైనాన్సులు ఇప్పించాలని, ఫైనాన్సర్ల బాధ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. చిన్న కంపనీలలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం భీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. వలస కూలీలకు, స్థానికులతో సమానంగా కూలీ డబ్బులు ఇవ్వాలని, బేధాలు చూపకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, అందె లక్ష్మణ్‌రావ్, శ్రీకాంత్, కిరణ్, ఆరిఫ్, సుమనళిని, సుమన్, దేవిప్రియ, బిందు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో రక్తదానంపై అవగాహన ర్యాలీ

**జూబ్లీహిల్స్, జనవరి 6, ప్రభాతవార్త:**




ర్యాలీలో ఐహెచ్‌బీటీ అధ్యాపకులు, సిబ్బంది.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిమ్స్ ఆసుపత్రిలో నిమ్స్ ఇమ్మ్యునో హిమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యుజన్ విభాగం(ఐహెచ్‌బీటీ) విభాగం ఆధ్వర్యంలో నిమ్స్ ఆవరణలో రక్తదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. నిమ్స్ బ్లడ్ బ్యాంక్ హెచ్ఓడీ డాక్టర్ సుధీర్ వుజ్జిని మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మొత్తం 50 స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఐహెచ్‌బీటీ అధ్యాపకులు, సాంకేతిక సిబ్బంది నర్సింగ్ సిబ్బంది, రెసిడెంట్లు, బీఎస్సీ ట్రాన్స్‌ఫ్యుజన్ మెడిసిన్ విద్యార్థుల సమిష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు. గతేడాది నిమ్స్ బ్లడ్ బ్యాంక్ చరిత్ర లోనే అత్యధికంగా 25,105 యూనిట్ల రక్తసేకరణ చేపట్టామన్నారు. అలాగే అఫెరిసిస్ కిట్ల సరఫరా పరిమితులు ఉన్నప్పటికి ఈ ఏడాది 727 సింగిల్ డోనర్ ప్లేట్లెట్(ఎస్డీపీ) ప్రక్రియలను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ఆధ్వర్యంలో ఈ విజయాలను అందుకున్నట్లు వివరించారు. భవిష్యత్తులోనూ స్వచ్ఛంద రక్తదానాన్ని మరింత బలోపేతం చేయడం, సురక్షిత రక్త సరఫరాను నిర్ధారించడం, అవసరమైన రోగులకు నాణ్యమైన రక్తమార్పిడి సేవలు అందించడం పట్ల కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదాతలను ఇక్కడ సన్మానించారు.

## ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం

**జూబ్లీహిల్స్, జనవరి 6, ప్రభాతవార్త:**

విద్యార్థులైన ఇద్దరు అక్కా చెల్లెల్లు అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. ఎర్రగడ్డ నేతాజీ నగర్‌లో నివసించే రేఖకు వైష్ణవి(16), దీపిక (14) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా వారిద్దరు ఒకరు పదో తరగతి, మరొకరు 8వ తరగతి చదువుతున్నారు. సోమవారం పాఠశాలకు వెళ్తున్నామని ఇద్దరు అక్కాచెల్లెల్లు ఇంట్లో చెప్పి వెళ్లారు.కాగా వారిద్దరు పాఠశాలకు రాలేదని కుటుంబ సభ్యులకు పాఠశాల నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు అంతటా వెదికినా ఫలితం లేదు. ఈ మేరకు చిన్నారుల తల్లి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గృహిణి మృతికి పదివేల నష్టపరిహారం చెల్లించండి

**చాంద్రాయణగుట్ట, జనవరి 6, ప్రభాతవార్త :** ద్విచక్రవాహనంపై వెళుతున్న భార్యభర్తలను ఢీకొట్టిన కేసులో బస్‌డ్రైవర్‌తోపాటు ట్రావెల్ ఏజెన్సీకి కోర్టు పదివేల జరిమానా విధించింది. అందుకు సంబంధిన నష్టపరిహారం చెల్లించాలని ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీని ఆదేశించింది. వివరాలలోకి వెళితే....పాతబస్తీ ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన బి చంద్రమోహన్ (42), 2019 జూన్ 6వ తేదిన తన ఇంటి నుండి భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై పటాన్ చెరువులోని వారి బంధువుల ఇంటికి బయలుదేరారు. రామచంద్రాపురం ఈక్రిసాట్ ప్రధాన ద్వారం మార్గం వద్ద శ్రీనిజ ట్రావెల్స్‌కు చెందిన బస్ డ్రైవర్ గొల్ల మారుతి అతి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి చంద్రమోహన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో దంపతులిద్దరూ కిందపడ్డారు. చంద్రమోహన్ భార్య సంఘటన స్థలంలోనే మృతి చెందింది. చంద్రమోహన్‌కు గాయాలయ్యాయి. తనకు నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని చంద్రమోహన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ కమ్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు పదవ అదనపు చీఫ్ జడ్జి సిహెచ్.జితేందర్ కేసు పూర్వాపరాలు, సాక్షాధారాలను పరిశీలించి, బాధితుడు చంద్రమోహన్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ఆసుపత్రిలో చికిత్సకు సంబంధించిన బిల్లులను సమర్పించని విషయాన్ని పరిగణలోకి తీసుకొని, ప్రతివాదులు, శ్రీనిజ ట్రావెల్స్ యాజమాన్యం, బస్ డ్రైవర్, ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా బాధితునికి పదివేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

## ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రూ.15లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశం

**చాంద్రాయణగుట్ట, జనవరి 6, ప్రభాతవార్త :** వాహనాన్ని అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి కొడుకు మృతికి, తల్లి తీవ్ర గాయాలకు కారకుడైన బస్ డ్రైవర్‌కు రూ.15 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సిటీ సివిల్ కోర్ట్ ఆదేశించింది. కేసు పూర్వాపరాలు ఇలా వున్నాయి... నగరానికి చెందిన వి.అనిల్ కుమార్ (33) తన తల్లి వి.యాదమ్మతో కలిసి తన ద్విచక్ర వాహనముపై 2021 అక్టోబర్ 1న ఉదయం 7 గంటల 40 నిమిషాలకు పిఎన్‌టి ఫ్లైఓవర్ పై నుండి వెళ్తున్నాడు. ఇంతలో మొహమ్మద్ మైబూబ్ హుస్సేన్ అనే వ్యక్తి తన హీరో హోండా మోటార్ సైకిల్‌పై మితిమీర వేగంతో, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి అనిల్ కుమార్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో తల్లి, కొడుకులు మోటార్ సైకిల్‌పై నుండి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని వెంటనే యశోద ఆసుపత్రికి తరలించారు. అనిల్ కుమార్ అప్పటికే మృతి చెందాడని డ్యూటీ డాక్టర్లు తెలిపారు. మృతుని తల్లిదండ్రులు తమకు నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలు, సాక్షాధారాలను పరిశీలించిన మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబునల్ చైర్మన్ కమ్ సిటీ సివిల్ కోర్ట్ చీఫ్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎస్.శశిధర్ రెడ్డి ప్రతివాదులు మొహమ్మద్ మహబూబ్ హుస్సేన్, టాటా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా బాధితులకు నష్టపరిహారం కింద రూ 15,48,328 చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.

## భార్యను వేధించిన భర్తకు మూడేళ్ళ జైలు, రూ.వంద జరిమానా

**చాంద్రాయణగుట్ట, జనవరి 6, ప్రభాతవార్త :** భార్యను వేధించిన భర్తకు జైలు, జరిమానా విధించింది కోర్టు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... నగరంలోని జియాగూడ ప్రాంతానికి చెందిన కె.శివనారాయణ అలియాస్ బాబురావు వివాహము ఇందిరతో 1992 సంవత్సరంలో జరిగింది. వివాహ సమయములో వరుని డిమాండ్ మేరకు వధువు తల్లిదండ్రులు వరంగల్ జిల్లాలో ఒక ఎకరం భూమి, 20 తులాల బంగారము, ఇతర గృహోపకరణాలు ఇచ్చారు. వివాహం అనంతరం వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలము తర్వాత తన భర్త శివనారాయణకు మరో స్త్రీతో వివాహ ఏతర సంబంధం ఉందని భార్య ఇందిరకు తెలిసింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. శివనారాయణ మద్యం సేవించి వచ్చి భార్యా పిల్లలను అసభ్య పదజాలంతో దూషించి, వారిపై చేయి చేసుకునేవాడు. 2019 సంవత్సరంలో భార్య, పిల్లలను వదిలేసి శివనారాయణ మరో స్త్రీతో కలిసి ఉంటున్నాడు. భర్త వేధింపులను భరించలేక ఇందిరా సౌత్ జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనిత ప్రాసిక్యూషన్ నిర్వహించారు. కేసు పూర్వాపరాలు, సాక్షాధారాలను పరిశీలించిన 15వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అజయ్ కుమార్ దేవన్ తుది తీర్పు చెప్పారు. నిందితునికి 498(ఎ) ఐపీసీ సెక్షన్ కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, వంద రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెలించని పక్షంలో 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు.

## 10 కిలోల గంజాయి స్వాధీనం

**సంజీవరెడ్డినగర్, జనవరి 6, ప్రభాతవార్త :**

డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసులు చర్యలు చేపడుతున్నప్పటికీ తరచూ ఎక్కడో ఒకచోట డ్రగ్స్ కలకలం రేపుతూనే ఉన్నాయి. పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ కట్టడీ చేస్తున్నప్పటికీ హైదరాబాద్‌లో డ్రగ్స్ దందాకు శుభం కార్డు పడటం లేదు. హైదరాబాద్‌లో ఈగల్ ఫోర్స్, ఎస్ఆర్‌నగర్ పోలీసుల సంయుక్తంగా చేపట్టిన చేపట్టిన ఆపరేషన్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. నేచర్ క్యూర్ హాస్పిటల్ రైల్వే స్టేషన్ దగ్గర రూ.ఐదు లక్షల విలువజేసి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రగ్స్ సప్లై చేస్తున్న మైనర్‌ను అరెస్ట్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న మైనర్ బాలుడు డ్రగ్స్ సిండికేటర్లకు డ్రగ్ ట్రాన్స్‌పోర్టర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు ఆర్థికంగా బలహీనుడైన బాలుడిని వినియోగించుకొని ముంబై ముఠా డ్రగ్స్ దందా చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు. ఒడిశా నుంచి హైదరాబాద్ గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించిన పోలీసులు మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని మైనర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతన్ని ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు పరారీలో ఉన్న ముంబై డ్రగ్స్ సరఫరాదారుల కోసం గాలింపు చేపట్టారు.

## కీచక ప్రిన్సిపాల్‌కి దేహశుద్ధి

**జగద్గిరిగుట్ట, జనవరి 6, ప్రభాతవార్త**

భావితరానికి విద్యాబుద్ధులు నేర్పి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయమైన పాత్రను పోషిస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల కీచకుడిగా మారాడు. పదోతరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రిన్సిపల్‌కు దేహశుద్ధి చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి చంద్రగిరినగర్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు ఆగ్రహంతో ప్రిన్సిపల్ విజయ్ కుమార్‌ను చితక బాదారు. పాఠశాలపై దాడి చేసి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం ప్రిన్సిపల్ విజయ్ కుమార్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చాకుతో సంచరిస్తున్న వ్యక్తికి 15రోజుల జైలు



పోలీసుల అదుపులో చాకుతో సంచరిస్తున్న సత్తార్ ఖురేషీ

**చాంద్రాయణగుట్ట, జనవరి 6, ప్రభాతవార్త :** చాకుతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తికి కోర్టు 15 రోజుల జైలుశిక్ష విధించింది. చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న కేసు వివరాలు ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి తెలిపిన ప్రకారం... చాంద్రాయణగుట్ట నివాసి, కూలీ పనిచేసే సత్తార్ ఖురేషీ ఎలియాస్ సలీమ్ (43) కత్తితో అనుమానస్పదంగా సంచరిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. సలీమ్‌పై 61(ఎ) సీపీ యాక్ట్ కింద ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని 9వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కేసును విచారించిన కోర్టు నిందితుడు సలీమ్‌కు 15 రోజుల జైలుశిక్ష విధించింది. పోలీసులు అతనిని చంచల్ గూడ జైలుకు తరలించారు.కేసును ఎస్సై శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

## అబ్దుల్ కలాం ఓఎస్డీ పేరుతో మోసం

**- బంజారాహిల్స్‌లో గ్రూప్-1 అభ్యర్థి ఫిర్యాదు**

**జూబ్లీహిల్స్, జనవరి 6, ప్రభాతవార్త:**

గ్రూప్-1 ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఒక అభ్యర్థి నుంచి రూ.7 లక్షలకు పైగా డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేటకు చెందిన వోరుగంటి అభిరామ్ 2018 నుంచి గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. 2022 ఏప్రిల్‌లో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైన సమయంలో పరిచయమైన సయ్యద్ హైదర్ హుస్సేన్ అనే వ్యక్తి తనను మాజీ భారత రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం వ్యక్తిగత కార్యదర్శి (ఓఎస్డీ)గా పనిచేశానని చెప్పుకొని నమ్మించాడు. ఢిల్లీలో జాతీయ స్థాయి రాజకీయ నాయకులతో బలమైన పరిచయాలు ఉన్నాయని, గ్రూప్-1 ఉద్యోగం సులభంగా ఇప్పిస్తానని నమ్మించాడు. ఉద్యోగం వచ్చిన తర్వాతే డబ్బులు చెల్లిస్తే సరిపోతుందని, ఈఎంఐ విధానంలో చెల్లించవచ్చని చెప్పడంతో నమ్మిన బాధితుడు 2022 అక్టోబర్ నుంచి 2023 జనవరి వరకు దశలవారీగా రూ.6 లక్షలు చెల్లించాడు. ఈ క్రమంలో నోటిఫికేషన్ పేపర్ లీకేజీ, కోర్టు ఆదేశాలతో పలుమార్లు రద్దు కావడంతో ప్రక్రియ ఆలస్యమైంది. గతేడాది జులైలో ఫలితాలు రానున్నాయంటూ ఢిల్లీ నుంచి జాతీయ నాయకుల వ్యక్తిగత కార్యదర్శులు వస్తారని చెప్పి మరో రూ.లక్ష వసూలు చేశాడు. డబ్బులు తిరిగి అడగడంతో నిరాకరించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఢిల్లీలో రాజకీయ పరిచయాలు ఉన్నాయని చెప్పి చంపేస్తానంటూ బెదిరించాడు. ఈ సంఘటనపై అభిమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బంజారాహిల్స్‌లో ఇద్దరు చిన్నారులు అదృశ్యం

**జూబ్లీహిల్స్, జనవరి 6, ప్రభాతవార్త:**

బంజారాహిల్స్‌లో అనుమానస్పద స్థితిలో ఇద్దరు చిన్నారులు అదృశ్యమయ్యారు. బంజారాహిల్స్‌పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 11 ఉదయ్‌నగర్ సమీపంలోని సింగాడ బస్తీలో నివసించే సనాబేగం సోదరి సబియాబేగం భోపాల్‌లో ఉంటుంది. గత ఏడాది అక్టోబరులో సబియాబేగం తన కుమారులు ఫర్హాన్‌ఖాన్(10), ఇయాన్‌ఖాన్(7)లను భోపాల్ నుంచి తన సోదరి ఇంటికి చదువు కోసం పంపింది. సోదరులిద్దరు బడికి వెళ్లకుండా అల్లరిగా తిరుగుతుండటంతో ఇద్దరిని మదర్సాలో చేర్చారు. అక్కడి నుంచి సైతం పారిపోయి ఇంటికి వచ్చారు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు ఇంటికి తిరిగిరాలేదు. దీంతో సనాబేగం తన కుటుంబ సభ్యులతో కలిసి అన్ని ప్రాంతాల్లో వెదికింది. ఫలితం లేకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి గాలిస్తున్నారు.

## రూ. 20 కోసం కర్రతో దాడి చేశాడు

**జూబ్లీహిల్స్, జనవరి 6, ప్రభాతవార్త:**

రూ. 20 కోసం కర్రతో దాడి చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండలో నివసించే శంకర్ కాకతీయ వైన్స్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన రాకేష్ అనే వ్యక్తి రూ. 20 కావాలంటూ అడిగాడు. డబ్బులు ఇవ్వడానికి శంకర్ నిరాకరించడంతో తిట్టుకుంటూ శంకర్‌ను వెంబడించాడు. సమీపంలో ఉన్న కర్ర తీసుకొని తలపై దాడి చేశాడు. దీంతో అతనికి తీవ్ర రక్తస్రావమైంది. శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రగ్ పరీక్షలో చిక్కిన దుకాణ సేల్స్ మేనేజర్

**జూబ్లీహిల్స్, జనవరి 6, ప్రభాతవార్త:**

డ్రగ్ పరీక్షల్లో ఒక దుకాణ సేల్స్ మేనేజర్ పట్టుబడ్డాడు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని వెస్టెండ్ మాల్‌లో ఉన్న ఎఫ్‌జెడ్ఓ షాప్‌లో తడికమళ్ల వంశీ(24) సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఖమ్మం జిల్లా వైరా ప్రాంతానికి చెందిన అతను పర్వత్‌నగర్‌లో నివసిస్తున్నాడు. కాగా పోలీసులకు అందిన సమాచారం మేరకు స్టోర్‌లో ఉన్న వంశీకి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా గంజాయి సేవించినట్లు గుర్తించారు. దీంతో అతనిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 10 నెలల్లో రూ.15 కోట్ల అభివృద్ధి : బానుక నర్మద



విలేకర్ల సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 6 ప్రభాతవార్త:** మల్కాజిగిరి ఎంపీ ఈటెల సహకారంతో కంటోన్మెంట్‌లో 10 నెలల్లో రూ.15 కోట్లతో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్ ఎమ్మెల్యే కంటోన్మెంట్‌కు కనీసం 5 వేల కోట్ల రూపాయలు ఎక్కడైనా ఖర్చు చేశారా అని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ ప్రశ్నించారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి 18 నెలలు అయింది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ నిధుల తో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారో శ్వేత పత్రం విడుద ల చేయాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇక్కడ ఎంపీగా ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ఎంపీ ఈటెల రాజేందర్ సహకారంతో రూ.303 కోట్లు విడుదల చేసి కంటోన్మెంట్ ఖాతాలోకే వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం బోర్డుకు రావాల్సిన టీపిటీ బకాయిలు తీసుకు రావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికలా విలీనమా అనే అంశంపై స్పష్టత లేదన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు బి.ఎస్.శ్రీనివాస్, పిట్ల నాగేశ్, విజయానంద్, రాజ్ మల్లేశ్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సత్కరించిన కంటోన్మెంట్ వికాస్ మంచ్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానిస్తున్న కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు సంకి రవిందర్ తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 6 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సివిల్ ఏరియా ప్రాంతాలను జిహెచ్ఎంసీలో విలీనం చేయాల నే అంశాన్ని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అసెంబ్లీలో ప్రస్తావించినందుకు కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు శాలువకప్పి ఘనం గా సన్మానించారు. కంటోన్మెంట్‌లో రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ వంటి మౌళిక వసతులు లేక సతమతమౌతున్న కంటోన్మెం ట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేయాలని ప్రతి ఏటా రూ.50 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు విడుదల చేయాలని శాసన సభలో ప్రస్తావించడం అభినందనీయమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసీలో విలీనం చేస్తే మ రింత అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వికాస్ మం చ్ ప్రతినిధులు రామదుగు దామోదర్, ప్రభుగుప్త, అంబాల శ్రీనివా స్, పసియుద్దీన్, గిరి, సతీష్, ప్రవీన్, క్రిష్ణ పాల్గొన్నారు.

## పాతబస్తీలో బిఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి : సాయి కిరణ్



బిఆర్ఎస్‌లో చేరిన వారితో కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్

**చార్మినార్ జనవరి 6, ప్రభాతవార్త :** బహదూర్‌పుర నియోజకవర్గం లో బిఆర్ఎస్‌ను బలోపేతం చేయటానికినాయకులు,కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ అన్నారు.ఖాజా,రహీమ్,షాబుద్దీన్‌తో పాటు పలువురు బహదూర్‌పుర నియాజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మీర్ ఇనాయత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ మాట్లాడుతూ మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగా లలో విఫలమైందని తెలిపారు.రానున్న రోజులలో రాష్ట్రంలో మళ్లీ కేసిఆర్ ప్రభుత్వం తిరిగి రావటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.నాయకులు,కార్యకర్తలు కలిసికేసిఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ఇంటింటికి వెళ్లి వివరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్‌బాగ్ డివిజన్‌కు చెందిన పలువురు బిఆర్ఎ స్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'మార్పు' చూపిన బాటలోనే టిఆర్‌టిఎఫ్ పయనం



దివంగత మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, జనవరి 6, ప్రభాతవార్త :** ఉపాధ్యాయలోకపు ప్రాతఃస్మరణీయులు, టీఆర్‌టీఎఫ్ వ్యవస్థాపకులు, శాసనమండలి మాజీ సభ్యులు దివంగత మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని మంగళ వారం ఘనంగా జరుపుకున్నారు. లలితాబాగ్ రోడ్డులోని శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ నేతలు, ఆ పాఠశాల ఉపాధ్యాయులు బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ మాట్లాడు తూ ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేసిన మార్పు బాలకృష్ణమ్మ ఆశాయలను కొనసాగిస్తున్నామన్నారు.. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్ మాట్లాడుతూ బాలకృష్ణమ్మ లేనిలోటు ఉపాధ్యాయుల ఉద్యమాలలో స్పష్టంగా కనిపిస్తుంద న్నారు. మార్పు చూపిన బాటలోనే ప్రస్తుతం టీఆర్‌టీఎఫ్ నాయక త్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, కోశాధికారి సగరం మీనా కుమారి, బహదూర్‌పురా మండల అధ్యక్షులు టి.జె.శ్రీధర్, శాలిబం డ జీజీహెచ్ఎస్ ఇంఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అంజలి, ప్రాథమి క పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు ప్రమీల, మంజుల, శ్రీదేవి, సంధ్య, నవనీత, నందిని, శశికళ, కొలనుపాక శివప్రసాద్, వేంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

**సికింద్రాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకొని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం గాంధీ ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదురుగా ఫుట్‌పాత్‌పాపై దాదాపు 60 సంవత్సరాల వృద్ధుడు మృతిచెంది ఉండగా అందిన సమాచారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపై నీలిరంగు ప్యాంటు, బుడిద రంగు చొక్కా ధరించి ఉన్నారు. బందువులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## రూ.50 వేల కోట్లకు, రూ.50 కోట్లకు పొంతన లేదు : మన్నె క్రిశాంక్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ మీడియా కన్వీనర్ మన్నెక్రిశాంక్ తదితరులు

**కంటోన్మెంట్,జనవరి 6 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ అసెంబ్లీలో ప్రసంగం లో ఎలాంటి పొంతన లేదని, రూ.50 వేల కోట్లతో కంటోన్మెంట్ అభివృద్ధి జరిగిందని సిఎంరేవంత్ రెడ్డి ప్రక టిస్తే కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.50 కోట్లునవిడుదల చేయాలని చెప్పడం హస్యాస్పందంగా ఉందని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నెక్రిశాంక్ ఎద్దేవ చేశారు. మంగళవారం పికెట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కం టోన్మెంట్‌కు రూ.50 వేల కోట్లతో అభివృద్ధి చేశామని ఓ పైపు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తే కంటోన్మెంట్ అభివృ ద్ధికి రూ.50 వేల కోట్లు విడుదల చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాన్ని బలపరుస్తున్నారా అని ప్రశ్నించారు. కనీసం ఇప్పుడైనా యాభై కోట్లు తీసుకు రావాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో కంటోన్మెంట్‌లో మారేడ్‌పల్లి, మడ్‌పోర్ట్, రసూల్ పుర,సిల్వల్ కంపౌండ్ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కెటాయించడంలో కాంగ్రెస్ ప్రభు త్వం విఫలమైందన్నారు. గ్రేటర్‌తో పాటు కంటోన్మెం ట్‌కు ఉచిత మంచినీటి పథకం అమలు చేయడంతో పాటు దసరా, క్రిస్మస్, రంజాన్ పండుగలకు అప్పటి ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో కనీసం బతుకమ్మ చీరలు కూడా ఇవ్వలేద న్నారు. అదే విధంగా బొల్లారం కిమ్స్ ఆసుపత్రి నిర్మాణా నికి రూ.900 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. కేంద్రంలో బిజెపి,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. గుంతల రోడ్లకు అతుకులు (ప్యాచ్) వర్కు చేసి 15 కోట్ల తో అభివృద్ధి చేశామని చెప్పుకోవడం హస్యాస్పందంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వాల తీరు పైన పటారం, లోపల లొటారంగా ఉందని ఎద్దేవ చేశారు. కంటోన్మెంట్ బోర్డు విలీన అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఏ.ఎల్. ఆనంద్, యాసీన్,మును తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ప్రతినిధులు

**మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 6 ప్రభాతవార్త :** చార్‌కమాన్ స్వర్ణకార యూనియన్.చారిటబుల్ ట్రస్ట్ భవనంలో మంగళవారం హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం (2026) క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరి గింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరు రాఘవ చారిహైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం కొత్త సంవత్స రం (2026) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, రంగారె డ్డి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు మారోజు జంగా చారి,ప్రధాన కార్యదర్శి మహేశ్వరం సంతోష్ చారితో పాటు హైదరాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం పరిధిలోఉన్న అన్ని సంఘాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, ప్రతిని ధులు పాల్గొన్నారు.

## పురుషోత్తం గుప్తను సన్మానించిన అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు



పురుషోత్తం గుప్తను సన్మానిస్తున్న అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు

**యాకుత్‌పుర.జనవరి 6 ప్రభాతవార్త :** ది హైదరాబాద్ హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాథ్ మర్చం ట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన ప్రముఖ వస్త్రాల వ్యాపారి పురుషోత్తం గుప్తను మంగళవారం మాజీ అగర్వాల్ సమాజ్ అధ్యక్షులు గోవింద అగర్వాల్,అఖిల భారతీయ అగ్రవాల్ సమ్మేళన్ రాష్ట్రీయ సంఘటన కార్య దర్శి శశికాంత్ అగర్వాల్,మహేసర్ మాతా భక్త మండలి అధ్యక్షులు రాజ్‌కుమార్ అగర్వాల్,సంఘీ సమితి సలహా దారులు రాజేందర్ సంఘీ,డాల్మియా సమాజ్ సలహాదా రులు సావర్‌మల్ డాల్మియా,అగర్వాల్ సమాజ్ అత్తాపూర్ సెంట్రల్‌శాఖ అధ్యక్షులు ముకేష్ కుమార్ అగర్వాల్ కలిసి శాలువ కప్పి సన్మానించారు.

## యేసు బోధనలు నేటికీ అనుసరణీయం



మంగళవారం గాంధీనగర్ జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 6 (ప్రభాతవార్త ) :** యేసు బోధన లు నేటికీ ఆచరించదగిన సుత్రాలని పలువురు ఫాస్టర్లు అన్నారు. గాంధీనగర్ ఫాస్టార్స్ అసోసియేషన్ పర్యవేక్షణ లో మంగళవారం గాంధీనగర్ జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్స ర వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఫాస్టర్లు లేమానియాల్, కార్యదర్శి డేనియల్, సభ్యులు రాచంద్రరావు, బ్రూస్ తదితరులు ప్రసగించారు. యేసు బోధనలు ఆచరణీయం అన్నారు. శాంతియుతమైన నీతివంతమైన సమాజ నిర్మాణానికి మార్గనిర్దేశం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కెనెడి రాజు, గుర్రం శంకర్, అభిషేక్ కెనెడీ, బీఆర్ఎస్ నాయకులు పాశం రవి, పున్న సత్యనారాయణ, మోజస్,దేవయ్య, విఠల్,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వర్గీకరణను సమీక్షించి మాలలకు న్యాయం చేయాలి



సుధాకర్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న వద్లమూరి కృష్ణస్వరూప్

**సైఫాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షు డిగా ధార్ల సుధాకర్ నియమితులైనారు. ఈ మేరకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.ఎల్.రాజు, సలహాదారు, సుప్రీం కోర్టు న్యాయవాది వద్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు ఆయనకు నియామకప త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వద్లమూరి మా ట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అక్రమంగా చేసి మాలలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తక్షణమే వర్గీకరణపై సమీక్షించి, అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సుధాకర్ మాట్లా డుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మాలల ను ఐక్యం చేసి నూతన కమిటీలు వేయడం జరుగుతుందని, మాల మహానాడును పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

## సిద్ధ కృష్ణ కూచిపూడి నృత్య అకాడమీ రజతోత్సవం నాట్య వైభవం



సిద్ధ కృష్ణ కూచిపూడి నృత్య అకాడమీ రజతోత్సవం నాట్య వైభవం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 6 (ప్రభాతవార్త ) :** సిద్ధ కృష్ణా కూచిపూడి నృత్య సంగీత అకాడమీ రజతో త్సవం మంగళవారం శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై పలు శాస్త్రీయ నృత్య అంశాలతో నాట్య వైభవంగా జరిగింది ప్రఖ్యాత నాట్య గురువు సుజాత బలిజేపల్లి శిష్యులు హేమ శ్రీ, గాయత్రి, లలిత శ్రీయ, సుభద,తాన్య నాయర్, శాన్వి జైస్వాల్, ప్రిష పన్నెపల్లి లు దయానంద సరస్వతి విరచిత బో శంభో అంశం ను నవ రస ప్రాధాన్యం గా నర్తించి స్వాతి తిరునాళ్ రచన ఓమ్ నమశ్శివాయ శంకర శ్రీ గిరి అంశం శ్రీ రాజ రాజేశ్వరీ అంశాలు లయ జతి బద్ధం గా ప్రదర్శించారు గురువు సుజాత స్వయం గా అన్నమాచార్య కీర్తన వచ్చె ను అలివేలు మంగా అంశం లాస్యం గా నర్తించి సిద్ధేం ద్రయోగి విరచిత భామా కలాపం లోని ప్రవేశ దరువు భామనే సత్య భామనే అంశం లో సుజాత ప్రదర్శించిన స్వాతిశయం తో హుయలు కురిపిస్తూ నర్తించి ప్రేక్షకుల్ని సమ్మోహితులను చేశారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ప్రతిభా వంత శిష్యులను తయారు చేయ డం గురువు లోని గొప్పతనం తెలుస్తుంది అన్నారు సుజాత మూర్తి ఆ బాధ్యత సమర్ధ వంతం గా నిర్వహి స్తున్నారు అని అభినందించారు సమాజ నిర్మాణం లో పిల్లలకు మంచి .మార్గం చూపే బాధ్యతగురువులు తల్లి తండ్రుల పైనే ఉంది అని చెప్పారు వేదిక పై రాష్ట్ర ప్రభుత్వ అధికారి అన్నపూర్ణ నటి అర్చన విజయశాస్త్రి సాయి అనురాగ్ పాల్గొన్నారు.

## బధిరులకు ప్రత్యేక కళాశాలల ఏర్పాటుపై మంత్రికి కృతజ్ఞతలు



ప్రసంగిస్తున్న తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి

**చిక్కడపల్లి జనవరి 6 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బధిరులకు ప్రత్యేకంగా జూనియర్, డిగ్రీ కాలే జీ ఏర్పాటు కు రాష్ట్ర వికలాంగుల వృద్ధుల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సానుకూలంగా స్పందించడం విశేషమని డెవలప్మెంట్ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కాటమోని వెంకటేష్ గౌడ్ వివరించారు. మంగళవారం బాగ్ లింగం పల్లి సంఘం కేంద్ర కార్యాలయంలో వారి మాట్లాడుతూ మలక్ పేట వికలాంగుల సంక్షేమ భవన్ ఆవరణలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల సందర్బంగా మం త్రి ప్రకటించడం జరిగిందని, గత 10 సంత్సరాలు గా తమ సంఘం ఆధ్వర్యంలో పలుదఫాలుగా మంత్రు లకు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, . గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర క్ష్యం వలన బధిరుల విద్యార్థుల చదువులకు నష్టం పోవడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రేమ్ కుమార్, బి. రాఘవేంద్ర, సుబ్బ య్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## చలాన్ల మీద ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై చూపండి : టిడిపి నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

**ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** ట్రాఫిక్ చలాన్లపై చూపిస్తున్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణపై చూపించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు నల్లెల్ల కిషోర్, నాగునగేష్, పి.బాలరాజ్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ట్రాఫిక్ చలాన్లను తప్పుపట్టిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం కన్నా దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చలాన్లపై నాడు విమర్శలు చేసిన ముఖ్యమంత్రి నేడు అడ్డగోలుగా చలాన్లు వసూలు చేస్తూ ప్రజలపై జులుం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం చలాన్ లేని బండి ఒక్కటి కూడా లేదని, ప్రతి కుటుంబం నుంచి వేల రూపాయలలో చలాన్లు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవై పు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, మరోవైపు చలాన్ల రూపంలో అంత కన్నా ఎక్కువ దోచుకుంటున్నారని విమర్శించారు. ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలేసి, ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లమీదనే దృష్టి పెడుతున్నారని, ప్రతి కూడలి వద్ద పది మంది పోలీసులు చలాన్లకోసం వేచి చూస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత ఫోన్లతో ఫొటోలు తీసి, చలాన్లు వేయవద్దని కోర్టు ఎన్నిసార్లు చివాట్లు పెట్టినా, పోలీసులు ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, చాటు మాటుగా ఫొటోలు తీస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచే స్తున్నారని మండిపడ్డారు. పాడైపోయిన రోడ్లను మరమ్మత్తు చేయాలనే సోయలేని ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయలేదని విమర్శించారు. తక్షణమే ట్రాఫిక్ చలాన్ల దోపిడీని ఆపాలని, ట్రాఫిక్ చలాన్లను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్.ప్రకాష్, కరణం కిరణ్, తడక వినోద్, అనిల్ కురుమ, శ్యాంసుందర్, ఏ.వెంకటేష్, సుక్రవేది పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ పార్కుల కబ్జాలపై డిప్యూటీ కమిషనర్‌కు ఆకుల సతీష్ ఫిర్యాదు



టౌన్ ప్లానింగ్ ఏసిపిని కలిసి ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

**నిజాంపేట్, జనవరి 6, ప్రభాతవార్త** నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రగతి నగర్ నందు 178, 179 ప్రగతి స్కూల్ పక్కన మూడు ఎకరాల పార్కులో ఆక్రమణలు తొలగించి పార్కును అభివృద్ధి చేయాలని అలాగే విష్ణుప్రియ లేఔట్ నందు రెండు వేల గజాల పార్క్ స్థలంలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని మంగళవానం ఆకుల సతీష్ టౌన్ ప్లానింగ్ ఏసిపిని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ సర్వే నెంబరు 178, 179 మూడు ఎకరాల్లో పార్క్ స్థలంలో ప్రగతి స్కూల్ వర్కర్స్ కోసం షెడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ విషయంపై పలు మార్లు ఫిర్యాదు చేసిన కమిషనర్ స్పందించకపోవడం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రగతి నగర్ విష్ణు ప్రియ లేఔట్‌లో సర్వేనెంబర్ 158, 159 హెచ్ఎండిఏ అప్రూవడ్ లేఔట్ నందు రెండు వేల గజాల పార్క్ స్థలంలో ఆక్రమిం చుకొని 15 షాపుల నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకుని, కాంపౌండ్ వాల్ నిర్మించాలన్నారు. పార్కు నందు చెత్తాచె దారం శుభ్రం చేసి ప్రజా వినియోగంలోకి తేవాలని గతంలో కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసిన నామమాత్రపు చర్యలు తీసుకొని కబ్జాదారులకు సహకరించడం , కమిషనర్‌కి పార్కుల పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని అన్నారు. అందుకే కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం లేదని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామని, తక్షణమే పా ర్కుల కబ్జాలపై చర్యలు తీసుకొని, పార్కులను అభివృద్ధి చేసి ప్రజా వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో అమలేశ్వరి, ఈశ్వర్ రెడ్డి, అరుణ్ రావు, మాధవరావు, పండు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడే నాయకులకు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యవర్గంలో ప్రాధాన్యం



సమావేశంలో పాల్గొన్న పార్టీ డిసిసి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్

**చార్మినార్,జనవరి 6 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న నాయకులకు తప్పకుండ హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి కార్యవర్గంలో తగిన ప్రాధాన్యత కల్పిస్తా మని,పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ బలంపెరిగిందని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా అన్నారు.సంఘటన్ సృజనఅభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దూద్‌బౌలిలో జరిగిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు జావిద్,సుబ్రమణ్య ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం ఫలాలు ప్రతీ ఇంటికి చేరే విధంగా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు.బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడు తూ ఆన్‌లైన్‌తో పాటు ప్రత్యక్షంగా పదవులుకోసం ధరఖాస్తులు చేసుకున్న వారికి పరిశీలకులు,డిసిసి అధ్యక్షులు దిశా నిర్దేశం ఇవ్వటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేష్ కుమార్,జి.కన్నయ్యలాల్,సయ్యద్ ఇక్బా ల్,మీర్ మహమూద్ అలీ,డివిజన్ అధ్యక్షులు భాను చందర్ యాదవ్,నజీర్,హమీద్ ఉద్దీన్,మెహరాజ్ బేగం,జాకీర్ హుస్సే న్ యువజన కాంగ్రెస్ నాయకులు ఫయాజ్,జ్యోతిశెట్టి, జహం గీర్,బిలాల్,ప్రవీణ్,అశ్వక్,గణేష్, అహ్మద్ షంషుద్దీన్, వాజిద్,రహ్మత్ ఉన్నీషా,శారదా శెట్టి,ముస్తాఫా,విజయలక్ష్మీతో పాటు పలువురు పాల్గొన్నారు.కాగా మంగళవారం హైదరాబా ద్ జిల్లాలోని చార్మినార్,బహదూర్‌పుర, యాకుత్‌పుర, మలక్‌పేట్,చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ సమక్షంలో కాంగెస్ పార్టీ సమావేశాలు జరిగాయి.

## వేగంగా క్రికెట్ గ్రౌండ్ పనులు పూర్తి చేయాలి



మణికొండ క్రికెట్ గ్రౌండ్‌లో నత్తనడకన సాగుతున్న పనులను పరిశీలిస్తున్న నవజ్యోతి యువజన సంఘం ప్రతినిధులు.

**నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త :** మణి కొండ డివిజన్ పరిధిలో నెల రోజుల క్రితం ప్రారంభించిన క్రికెట్ గ్రౌండ్ పనులను త్వరగా పూర్తి చేయాలని నవజ్యోతి యువజన సం ఘం చైర్మన్ బి.సాయిరెడ్డి నార్సింగి సర్కిల్ అధికారులను కోరారు. మంగళవారం క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న పనులను యువజన సంఘం సభ్యులు పరిశీలించారు. అనంతరం సాయిరెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన క్రికెట్ గ్రౌండ్ పనుల ను త్వరగా పూర్తి చేసి యువతకు అందుబా టులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తి కాకుండానే ఆగమేఘాల మీద ప్రారంభించి చేతులు దులుపుకున్నారని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో నవజ్యోతి యువ జన సంఘం సభ్యులు రవికాంత్‌రెడ్డి, కిరణన కుమార్, యాలాల నరేష్, మధుసూదన్‌రెడ్డి, డి.కుమార్. అరవింద్, హరికృష్ణారెడ్డి, సు నీల్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, శరత్, గణేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈలను రక్షించండి

**హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త:** వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను రక్షించాలని ప్రభుత్వానికి తెలంగాణ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంగళ వారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసో సియేషన్ ప్రతినిధులు అనిల్‌కుమార్, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ వాజీద్, మహ్మ ద్ అబ్దుల్ లతీఫ్, రవికుమార్, సతీష్, మహేందర్‌రెడ్డిలు మాట్లాడారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలకు అవసరమైన ఉత్పత్తులను అందిస్తూ మనుగడ సాధించే ఎంఎస్ఎంఈల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎంఎస్ఎంఈలకు ఇవ్వాల్సిన వర్క్ ఆర్డర్లను భారీ పరిశ్రమలకు ఇస్తుండటంతో తమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మా రిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పరిశ్రమలకు టెండర్లు అప్పజెప్పుతూ కొద్దిమంది వ్యక్తులకు లబ్ధిచేకూరే విధంగా అప్పజెప్పడం సరికాద న్నారు. ఈఅంశంపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకదృష్టి సారించి టెండర్లలో జరిగిన అక్రమాలను సరిచేయకడమే కాకుండా ఎంఎస్ఎంఈలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**TO LET OR RENT**

★ Ground Floor 3 Shops for Rent 350 sft each, Abids Main Road 30,000 each 7416393362. Parking available.

(Ro.No.37445)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE. RANGA REDDY DISTRICT AT: KHAITHALAPUR
O.S. No. 450 of 2025
BETWEEN:
M/s.FEDERAL BANK LTD. Madhapur Branch, Hyderabad. Represented by its Branch Manager Mr. Kiran GNSSR-SP S/o. Late G. Vishwanatham, Aged about 39 years, R/o. Flat No.301, Radhey Sri Apartment, III rd Floor, Arunodaya Colony, Madhapur. Hyderabad-500081.
.... PLAINTIFF
AND
Mr C Jagan
....DEFENDANT
To:
Mr. C Jagan, #Dry Car Care India Pvt Ltd, Plot No.459, Near YSR Statue, Hitech City, Hyderabad-500081.
Please take notice that the Plaintiff/Bank filed above suit against the defendants for recovery of an amount of Rs.3,57,893.86/- (Rupees Three Lakhs Fifty-seven thousand eight Hundred Ninety-Three and eighty-Six Only). The said suit is posted to 05-02-2026 for your appearance. You are required to appear before the Hon'ble Court on 05-02-2026 at 10-30 AM either personally or through Advocate, failing which the matter would be decided ex-parte.
(BY ORDER OF THE COURT)
VEERAGANTI ILENDER
G. SAI TEJA
Advocates
#Office at Flat No.301, Sri Srinivas Nivas, H.No.11-10-371, Road No.1, Telephone Colony, Kothapet, Hyderabad-500035
E.mail Id: veeragantiilender.advocate@gmail.com
Mobile No.9032706388.

IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE AT: SECUNDERABAD.
OS.NO. 1010 of 2025
BETWEEN:
ANURADHA TAMMADI and 1 other
...PLAINTIFFS
AND
The Tehsildar, Secunderabad
All Concern
....DEFENDANTS
To:
The Tehsildar Secunderabad, Hyderabad, Telangana.
All Concern
(Defendants)
NOTICE
PLEASE TAKE NOTICE that the above said Plaintiffs have filed the above suit for Legal Heirs of Late A. Mujavan against you before the Hon'ble XI Junior Civil Judge court and this Hon'ble court has directed for service of Notice to you. The above case is posted for your appearance on 19-01-2026 at 10:30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided as per law.
// BY ORDER OF THE COURT //
Sd/-K. PRIYA DARSHINI,
ADVOCATE,
Office @ H.no.287/2RT, 2nd Floor Vijaynagar Colony, Masab Tank, Hyderabad, TS.
Cell No.9154940048

IN THE COURT OF THE HONOURABLE CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
G.W.O.P. No. 42 OF 2025
BETWEEN:
Amitabh Dutt S/O Anil Kumar Dutt
...Petitioner
AND
1. The Commissioner and Director of Agriculture,
2. To The All Concerned.
..Respondents
Take Notice, Whereas the Petitioner named above has filed the Petition Under Section 14 (1) (LIMITED GUARDIANSHIP) Of The Rights Of Persons With Disabilities Act, 2016 to appoint and declare above named petitioner as the limited guardian of Yatindra Dutt who is a mentally disabled person and the Honourable court has issued Notice to you and to all the concerned and posted the matter to 23-01-2026 and called for objections, if any.
If there are any objections to appoint and declare Amitabh Dutt (Petitioner) as limited guardian of Yatindra Dutt sought by Petitioner you are hereby directed to appear in the aforementioned matter at 10.30 A.M. on 23-01-2026 either in person or through Counsel, failing which the matter will be decided on merits in your absence, as per law.
-BY ORDER OF THE COURT-
-Sd/-
R.VISHNU VARDHAN REDDY
ADVOCATE
G-4, SHR Apex, Ganga Enclave, Petbasheerabad, Quthbullapur Hyderabad-500067.
M:9493799915.

గౌరవనీయ III సీనియర్ సివిల్ జడ్జి వారి న్యాయస్థానంలో, హైదరాబాద్ జిల్లా. సికిందరాబాద్: వద్ద
O.S.No. 215 ఆఫ్ 2025
వీరి మధ్యలో :
M/s ఫెడరల్ బ్యాంక్, సికింద్రాబాద్ శాఖ, O/o ఫ్లాట్ నం. 101, షాప్ నం.7, గ్రౌండ్ ఫ్లోర్, లెజెండ్ క్రిస్టల్ బిల్డింగ్, పెండర్‌ఘాస్ట్ రోడ్, ప్యారడైజ్ సర్కిల్ దగ్గర, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500003. దాని అధీకృత ప్రతినిధి ప్రాతినిధ్యం
...ఫిర్యాది
మరియు
శ్రీ తిరుపతి రావు డాడిశెట్టి, వయస్సు: 37 సంవత్సరాలు, R/o: ఫ్లాట్ నం: 172, ఇం.నం.1, తారా నిలయం, మణికొండ, హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-500089. ప్రత్యామ్నాయంగా: R/o: ఫ్లాట్ నం.302, లెజెండ్ అపార్ట్‌మెంట్, శ్రీరాగ్ కాలనీ, కొత్తగూడ, హైదరాబాద్-500084.
...ప్రతివాదులు
O.S.No. 215 ఆఫ్ 2025 దావాలో ప్రతివాదికి నోటీస్
గౌరవనీయ III సీనియర్ సివిల్ జడ్జి, హైదరాబాద్ జిల్లా సికింద్రాబాద్ : వద్ద వారి ఎదుట పెండింగ్ O.S.No. 215 ఆఫ్ 2025లో ఫిర్యాది ఫెడరల్ బ్యాంక్ ప్రకటించునది ఏమనగా O.S.No. 215 ఆఫ్ 2025 దావాలో రూ.10,66,509/- (రూపాయలు పది లక్షల అరవై ఆరు వేల అయిదువందల మరియు తొమ్మిది మాత్రమే) యొక్క మొత్తం సొమ్ము రికవరీ కోరుతూ పై దావా దాఖలు చేయడమైనది. తదుపరి ప్రకటించునది ఏమనగా గౌరవనీయ III సీనియర్ సివిల్ జడ్జి, హైదరాబాద్ జిల్లా సికింద్రాబాద్: వద్ద వారి ఎదుట O.S.No. 215 ఆఫ్ 2025 02-02-2026 ఉ.10.30గం. వద్ద పోస్టెడ్ అయిఉన్నది. ఇందుమూలముగా తమరిని ప్రకటించునది ఏమనగా మీరు స్వయంగా గానీ లేదా మీ కౌన్సిల్ ద్వారా గానీ హాజరు కావలెనని ఆదేశించడమైనది. మరియు మీ వ్రాత పూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలెను. విఫలమైతే చట్ట ప్రకారం అనుసరించి, కేస్ నిర్ణయించబడుతుంది. కాబట్టి ఇందు మూలముగా ఈ ప్రకటన.
//గౌరవనీయ న్యాయస్థానం యొక్క ఉత్తర్వులే//
మానవ్ జెసిల్ థామస్ (న్యాయవాది)
O/o. ఇం.నం. 2-3-74/174, సత్యానగర్ కాలనీ, ఉప్పల్, హైదరాబాద్-500039.
ఫోన్: # 09849253977/ 9618574425
ఈమెయిల్ id:manavgecilthomas@gmail.com
వెబ్ సైట్: www.tgalaw.in

PUBLIC NOTICE
The Public in General is hereby informed that Our clients Property owners Nusrath Ara Begum, Asra Firdous,Anjum Firdous, Asma Firdous, Late Mohammed bin Mahfooz,Sayeed Bin Mahfooz, Ayesha Firdous, Ibrahim bin Mahfooz, Younus bin Mahfooz, Amina Firdous Affari, Arfath Bin Mahfooz, Afreen Firdous Affari, being the Legal Heirs of Late Mahfooz Bin Esaa @ Late Mahfooz Bin Essa Al Affariwho was the actual owner of the subject property,have entered into Loan Agreement by mortgaging their property totally admeasuring 1135 Sq. Yards situated at Bandlaguda Village having Door No.svide H.No. 8-4-62/63/64 in favour of IIFL Finance Ltd., Hyderabad.
Any person(s) is/are having any right, claim or interest/s or objection/s of whatsoever nature in respect of the above said property or above said transaction shall intimate the undersigned in writing along with supporting documents within Seven (7) Days from the date of this publication. Failing which our client will proceed further for Mortgage of the above said property and objection/s raised thereafter will not be entertained.
Sd/-M/s M. A. Faiz Siddiqui
Advocates & Associates
# 4-3-142/2/a, Flat No. 101, Kantha Reddy Nagar, Hyderabad, Telangana-500048.
Contact: 9700648260,
Email: asad.faizsiddiqui@gmail.com

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి : చైర్మన్ ముత్తినేని వీరయ్య



లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలలో పాల్గొని కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, ఫెడ్ చైర్మన్ గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం తదితరులు

**మలక్ పేట, జనవరి 6, ప్రభాతవార్త:**
దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని వికలాంగుల సంక్షేమ శాఖ చైర్మన్ ముత్తినేని వీరయ్య, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజలు పేర్కొన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ది డిసేబుల్డ్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మలక్ పేట్ సూపర్ బజార్ లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై లుయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధుల ఆరాధ్య దైవం అని పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఫెడ్ అధ్యక్షులు గంగారం, ప్రధాన కార్యదర్శి నాగభూషణం లు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలను ఐక్యరాజ్యసమితి బ్రెయిల్ ఎడ్యుకేషన్ దేగా ప్రకటించడం జరిగిందని వివరించారు. ఫెడ్ ఆధ్వర్యంలో మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల నాయకుడు నారా నాగేశ్వరరావు, రాజేష్, సుధాకర్,వెంకట్‌రెడ్డి, నబి పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో ఘనంగా తిరుప్పావై కైంకర్య సేవలు



హరి హరి క్షేత్రంలో స్వామి వారికి కైంకర్యా సేవ ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న అర్చకులు మంగళగిరి శ్రీనివాసచార్యులు తదితరులు

**మలక్ పేట ,జనవరి 6, ప్రభాతవార్త :**
మలక్ పేట పల్టన్ లోని శ్రీ హరిహర క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఘనంగా తిరుప్పావై కైంకర్యా సేవలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ఇఒ జోషి మార్తాండరావు, చైర్మన్ సూగురు రమేష్ లు మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు జనవరి 13వ తేదీ మంగళవారం వరకు కొనసాగుతాయని, ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు ఉదయం 6:30 నుంచి ఆరాధన అలంకారము, ధనుర్మాస అర్చనలు, నివేదన, ఉదయం 7 గంటలకు తిరుప్పావై ప్రబంధ సేవా కాలము, మంగళ శాసనము, పాసుర విన్నపము, తీర్థ ప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహస్తున్నట్లు వివరించారు. జనవరి 11వ తేదీ ఉదయం ధర్మ కుదారై పాశురం, గోదాదేవికి నిరాటోత్సవం ,108 గంగాలాలతో అక్కల వడిశల్ ప్రసాద నివేదన కార్యక్రమం, 14వ తేదీన శ్రీ గోదా కళ్యాణం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అర్చకులు మంగళగిరి శ్రీనివాసచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, దేవాలయం సభ్యులు శెట్టి విజయకుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రోడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట్, జనవరి 6, ప్రభాతవార్త:**
వేగవంతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ముసారాం బాగ్ డివిజన్ శాలివాహన నగర్ పార్క్ లో రూ.30 లక్షల జిహెచ్ఎంసి నిధులతో నిర్మించనున్న శాలివాహన నగర్ థీమ్ పార్క్ పనులను పార్క్ సభ్యులు, మరియు జిహెచ్ఎంసి యూబీడి సిబ్బంది తో కలిసి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ లో స్థానిక ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం థీమ్ పార్క్ పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. దీనికి సహకరించిన జిహెచ్ఎంసి యుబిడి సిబ్బంది, సభ్యులకు , చార్మినార్ జోన్ యుబిడి డైరెక్టర్ సునంద, పార్క్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. పార్కులో ప్రస్తుతం ఓపెన్ జిమ్, పిల్లల ఆటల పరికరాలు, టైల్స్, గజీబోల నిర్మాణం చేపడతారని రానున్న రోజుల్లో ఇతర అభివృధి పనులు చేపడతామని వివరించారు.ఈకార్యక్రమం లో యూబిడిమేనేజర్ కిరణ్, సూపర్వైజర్ కృష్ణ , పార్క్ సభ్యులు రాజేశ్వర్ రెడ్డి,జక్క మోహన్ రెడ్డి ,కమలాకర్,వెంకట్ రెడ్డి ,యాదగిరి సురేందర్ ,కృష్ణ రెడ్డి ,ప్రేమ కుమార్, యాదవ్, శివ,పరశురాం,శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్‌ను ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



పార్కు లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**వనస్థలిపురం. జనవరి.6.ప్రభాతవార్త.**
వైదేహి నగర్ నార్త్ కాలనీలోని రోడ్ నెంబర్ 12 పార్కులో, తెలంగాణ ప్రభుత్వం జిహెచ్ఎంసి నిధులతో మంజూరు చేయించి ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ పరికరాలను, వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఎల్బీనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద రెడ్డి , వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు కార్యదర్శి రాజేందర్ రెడ్డి లక్ష్మీనారాయణ వెంకట నరసింహారెడ్డి మూర్తి వెంకటేష్ గౌడ్ చక్రధర్ మరియు వైదేహి నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ కార్యదర్శి వెంకయ్య సభ్యులు ప్రకాష్ బాబు వేణుగోపాల్ శ్రీనివాసులు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాల నివారణకు వినూత్న రీతిలో పోలీసులు ఆటో ప్రచారం

### సంక్రాంతికి ఊర్లకు వెళ్తున్నారా? దొంగతనాల నివారణకు ఈ జాగ్రత్తలే భద్రత



**నేరేడ్ మెట్, జనవరి 6,ప్రభాతవార్త:**
రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఊర్లకు వెళ్లే ప్రజల భద్రత కోసం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాల నివారణపై ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా కాలనీలు, అపార్ట్మెంట్లలో ప్రజలకు అవసరమైన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు.ఈ సందర్భంగా నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ, పండుగ వేళ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారి ఇళ్లే దొంగల లక్ష్యంగా మారుతున్నాయని హెచ్చరించారు. ఊరికి వెళ్లే ముందు ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు వంటి విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంకు లాకర్‌లో భద్రపరచాలని సూచించారు. ఇల్లు తాళాలు వేసి వెళ్లే ముందు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, చుట్టుపక్కల నమ్మకమైన వ్యక్తులకు తెలియజేసి పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. ఊరికి వెళ్లే విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టు చేయకూడదని, ఇంటి పరిసరాల్లో రాత్రి స్పష్టంగా కనిపించే నైట్ విజన్, హై రిజల్యూషన్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం భద్రతకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పేపర్ బాయ్, పాలు వేసే వారికి ముందుగానే సమాచారం ఇచ్చి రావద్దని చెప్పాలని, ఇనుప బీరువాల్లో నగదు, బంగారం భద్రపరచకూడదని సూచించారు. అలాగే బయటకు వెళ్లినప్పుడు వాకిట్లో ముగ్గులు వేస్తున్న సమయంలో మెడలో బంగారు ఆభరణాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరి పట్లైనా అనుమానం కలిగితే వెంటనే 112కు గానీ లేదా నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ ప్రజలను కోరారు.పండుగను ఆనందంగా, భద్రంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఈ జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనం పైఅంతస్తు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సీనియర్ నేత ప్రదీప్‌రెడ్డి, హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంటుక కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.సంజీవరెడ్డి, జి.వి.బి. రంగారెడ్డి, ఆర్.దామోదర్‌రెడ్డి, కె.కిషన్,టి.భరత్‌సింగ్ తదితరులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు కమిటి సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం కమ్యూనిటి హాల్‌ను హబ్సిగూడ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్తంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. సభ్యుల సంఖ్య పెరుగుతున్న నేపధ్యంలో స్థలం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీనియర్ సిటిజన్ల కోసం నిర్వహించే సమావేశాలు, వైద్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అదనపు సౌకర్యాలు అవసరమని వివరించారు. ప్రస్తుతం ఉన్న భవనం పై అంతస్తులో అదనపు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు కాలేరు జైనవీన్, దేవేందర్, హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలే ప్రాణరక్షణ : ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్



**నేరెడ్‌మెట్, జనవరి 6,ప్రభాతవార్త :**
ప్రాణం చాలా ఖరీదు అయిందని ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని తద్వారా రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని నేరెడుమెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ పేర్కొన్నారు.రోడ్డు భద్రతా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నేరెడ్‌మెట్ పోలీసుల ఆధ్వర్యంలో నేరెడ్‌మెట్ పరిధిలోని సమరిటన్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, చిన్న నిర్లక్ష్యమే ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలకు దారితీస్తోందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలి అని స్పష్టం చేశారు. అధిక వేగం, ట్రాఫిక్ సంకేతాల ఉల్లంఘన, తప్పుదారి ప్రయాణం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ వాహనం నడపడం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు.అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలపై మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులు తెరవకూడదని, తెలియని కాల్స్‌కు వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదని, ఆన్‌లైన్ మోసాల బారిన పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరింది.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## చెత్తకు నిప్పు ప్రాణాలకు ముప్పు...బడంగ్‌పేట్‌లో పొగ కాలుష్యం

### -సానిటేషన్ సిబ్బందే చెత్తను కాల్చడంపై బిజెపి ఆగ్రహం



బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం సమీపంలోని ఓ రోడ్డు పక్కన చెత్తను తగులబెట్టిన దృశ్యం

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో ఓ వైపు స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ జరుగుతుండగా మరో వైపు అక్కడక్కడా శుభ్రం చేసిన ప్రాంతాల్లో చెత్తను సానిటేషన్ సిబ్బంది తగులబెడుతుండడం విమర్శలకు తావిచ్చింది. గత కొన్ని రోజులుగా శంషాబాద్ జోనల్ కమీషనర్ ఆర్.చంద్రకళ ఆదేశాల మేరకు స్థానిక బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో ముమ్మరంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్లపై ఆదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేయడంలో పారిశుధ్య సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ స్పెషల్ డ్రైవ్‌ను జోనల్ కమీషనర్, డిసిలు కూడా పర్యవేక్షించడం జరుగుతున్నది. అయితే రోడ్లను శుభ్రం చేసిన సిబ్బంది చెత్తను తరలించకుండా అక్కడికక్కడే నిప్పంటించి తగులబెడుతుండడంతో వాయు కాలుష్య సమస్యలకు దారి తీస్తున్నది. సాక్షాత్తు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి సమీపంలోనే చెత్తను తగులబెట్టడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. సంబంధిత సానిటరీ విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో చెత్తను ఎత్తేయాల్సిన సిబ్బంది గుట్టగా పేర్చి కాలుస్తుండడంతో రోడ్లపై వెళ్తున్న వారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అంతే కాకుండా సమీప ప్రాంతాల్లో పొగ వ్యాపిస్తుండడంతో విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు కూడా అవస్థలకు గురవుతున్నారు.

**చెత్తను తగులబెడుతుండడంపై బిజెపి నేతల సీరియస్**

కాగా బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్న తరుణంలో చెత్తను తరలించకుండా కాల్చడంపై బిజెపి నేతలు తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి సర్కిల్ కార్యాలయం సమీపంలోని ప్రాంతాల్లో చెత్తను కాల్చడాన్ని గమనించి ఫైర్ అయ్యారు. చెత్తను తగులబెడుతుండడంతో పొగ వ్యాపించి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. సంబంధిత సానిటేషన్ అధికారి బాధ్యతారాహిత్యాన్ని ఆయన తూర్పారబట్టారు. దేశ రాజధాన్ని పట్టి పీడిస్తున్న ఢిల్లీ పొగ కాలుష్యాన్ని ఆయన గుర్తు చేస్తూ బడంగ్‌పేట్‌లో అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడితే బిజెపి సహించేది లేదనీ మరో సారి చెత్తను కాల్చడం జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రామచంద్ర రావు



**మల్కాజిగిరి జనవరి 6,ప్రభాతవార్త :**
ఇటీవల అమెరికాలో స్వర్గస్తులైన మల్కాజిగిరి బిజెపి సీనియర్ నేత విఠోబా నివాసానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో పార్టీ వారికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.పార్టీ బలోపే తానికి వారు చేసిన సేవలు చిరస్మరణీయం..వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

### బీఎస్సీ క్లినికల్ సైకాలజీ ఆనర్స్ కోర్సు ప్రారంభం

**నేరేడ్ మెట్, జనవరి 6,ప్రభాతవార్త :** ఆర్‌కే పురం, నేరేడ్మెట్‌లోని హెలెన్ కిల్లర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్లో బీఎస్సీ క్లినికల్ సైకాలజీ ఆనర్స్ కోర్సు (2025-26) ప్రారంభం కావడం సంస్థకు గౌరవప్రదమైన మైలురాయిగా నిలిచిందని చైర్మన్ డాక్టర్ పఠాన్ ఉమర్ ఖాన్ తెలిపారు. తొలిసారిగా ఈ కోర్సుకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అధికారిక అనుమతులు లభించాయని వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఆర్ముగంను లేదా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు.

## విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు అవసరమే : నాగభూషణం



నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేస్తున్న మీర్‌పేట్ ఎస్ఐ నాగభూషణం

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:**
విద్యార్థులకు చదువుతో పాటు శారీరక మానసిక వికాసానికి తోడ్పడే క్రీడలు కూడా అవసరమే నని మీర్‌పేట్ సబ్ ఇన్స్‌పెక్టర్ టి.నాగభూషణం అన్నారు. బాలాపూర్ మండలంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చే మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో మంగళవారం ఈ-ఛాంప్స్ అండ్ ఈ-కిడ్స్ నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాబ్జి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మీర్‌పేట్ ఎస్ఐ టి.నాగభూషణం, నారాయణ ఎజిఎం రవీంద్రబాబులు ఎన్‌పిఎల్ క్రీడా పోటీల విజేతలకు మెడల్స్, షీల్డ్స్ తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ బాబ్జి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని, చురకుదనాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ-ఛాంప్స్ ఆర్అండ్ఇ మహేశ్వరి మీన, సిట ద్వి, ఈ-కిడ్స్ ఆర్అండ్‌డి మీన, సిట ప్రియాంకలతో పాటు ఎడి, విపిఎస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సైదాబాద్ డివిజన్ అభివృద్ధికి కృషి

### : కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి



సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ సాయిగంగ కాలనీలోని సాయిబాబా దేవాలయం నుండి శంకేశ్వర్ బజార్ నాలా వరకు రూ.9లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నందున యుజిడి, వాటర్‌లైన్స్‌కు ఏమైనా మరమ్మత్తులు చేయాల్సి ఉంటే మొదటగా ఆ పనులు చేపట్టాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. అనంతరం క్రాంతినగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

### నేడు శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం

**ఎల్.బి.నగర్, జనవరి 6 ప్రభాతవార్త:**
సద్గురు శ్రీత్యాగరాజస్వామి 179వ ఆరాధన మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు భారతీయ కళా సమితి నిర్వాహకుడు కృష్ణ తాండవ తెలిపారు. భారతీయ కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలు బుధవారం సాయంత్రం 5.30 గంటల నుంచి ఆర్కే పురం డివిజన్ అల్కాపురిలోని శృంగేరి మఠం వద్ద ప్రారంభమవుతాయన్నారు. ఉత్సవాలలో భాగంగా మృదుల, మహత్, ఆదిత్య వోకల్, ఉంచవృత్తి, పూజ, పంచరత్న సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిజన సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గోపీనాయక్

**ఎల్.బి.నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** గిరిజన సంఘం నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్లో నిర్వహించారు. కొమరంభీమ్, ఠానూనాయక్‌ల చిత్రపటాలతో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సబ్యులు ఏం.గోపి నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఉన్న గిరిజనులకు డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజన సంఘం పోరాడాలన్నారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కే.రాజునాయక్, యం.నాగరాజు, కే.రవినాయక్, యస్.భాస్కర్‌నాయక్, యం.శివనాయక్‌లు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు

**రామంతాపూర్, జనవరి 6 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్ డివిజన్‌లో కొత్తగా పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో సుమారు లక్ష జనాభా ఉందని, ఇప్పటికే రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తరించి ఉందన్నారు. విస్తీర్ణం ఎక్కువగా ఉండటం, జనసాంద్రత అధికంగా ఉండటంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని, ప్రజల భద్రత కోసం రామంతాపూర్ డివిజన్‌కు ప్రత్యేక పోలీస్ స్టేషన్ అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో మరింత పటిష్టమైన నేర నియంత్రణ చేయవచ్చని సూచించారు. దీనిపై డిజిపి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.98లక్షలతో డ్రైనేజీ పనులు : రజిత పరమేశ్వర్‌రెడ్డి



శ్రీరమణపురంలో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని శ్రీరమణపురం కాలనీలోని రూ.98 వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. మున్సిపల్ డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్ కుమార్, జలమండలి డిజిఎం రజనీకాంత్ రెడ్డి, శ్రీవాణి తదితరులు ఆమెతో పాటు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు దశలవారిగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే చర్చి కాలనీలో రూ.కోటి 9లక్షలతో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీరమణపురం కాలనీ అధ్యక్షులు రత్నారెడ్డి, రాఘవేందర్, రాములు, లూర్దురెడ్డి, సతీష్, పోలిశెట్టి సుధాకర్, శర్మ, పాండు, కృష్ణస్వామి, రాము, డేవిడ్, బాల,లక్ష్మి, కృష్ణవేణి, పద్మజ, సరస్వతి,నిర్మల, రాణి, గిరిజ, బాలస్వామి, వినోభ, పూసా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నేతలు లుకాస్, సత్తిరెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, బుక్కా సురేష్, సందీప్, భాస్కర్, వెంకట్ రెడ్డి, అలీం, రాములు,శంకర్, హరీష్ రెడ్డి, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తా : మంత్రి




**తుర్కయంజాల్ జనవరి 6, ప్రభాతవార్త**
తుర్కయంజాల్ సర్కిల్ లోని మన్నెగూడ, బి ఎమ్ ఆర్ స్వార్థ కన్వెన్షన్ హాల్లో మంగళవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ప్లాటిన జూబ్లీ మహోత్సవ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని వారు మాట్లాడుతూ... 1104 సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని గతంలో తన తండ్రి అందించిన మాదిరిగానే కార్మికుల పక్షాన నిలబడి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. అంతకుముందు ఆయన కోదండరాంతో కలిసి ఎలక్ట్రిసిటీ యూనియన్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు మరియు ఆర్టిజన్లను ప్రాతినిధ్యం వహిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేసే సిబ్బంది హక్కుల కోసం పోరాడే ట్రేడ్ యూనియన్. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ పిలువబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, వెంకటేశ్వర్లు రాజేందర్,, జనార్ధన్ రెడ్డి, వరప్రసాద్, సాయిబాబా, సంతోష్ కుమార్, మురళీమోహన్,ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సర్వేశ్వర్, యాదేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఉప్పల



వైద్య శిబిరంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గోల్కొండ మైసయ్య, వినోద్‌కుమార్

**ఎల్.బి.నగర్, జనవరి 6 ప్రభాతవార్త:**
ఉచిత వైద్య శిబిరాలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. లైఫ్ స్ప్రింగ్ ఫౌండేషన్ అధ్యక్షులు డప్పు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కత్తులు అనిల్‌కుమార్, కోశాధికారి డప్పు సాయికిరణ, తెలంగాణ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సంఘం నాగోల్, లైఫ్ స్ప్రింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నాగోల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని సూచించారు.అనుభవజ్ఞులైన వైద్యులు సేవలందించగా, వైద్య పరీక్షలు, రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, శ్రీపోచమ్మ దేవాలయం చైర్మన్ గోల్కొండ మైసయ్య, దళిత సంఘాల నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన



రోడ్డు భద్రతా ఉత్సవాల్లో పాల్గొన్న ఎంవిఐ రవీందర్‌రెడ్డి, ఉమా, శ్రీనివాస్, స్కూల్ కరస్పాండెంట్ జోషి తదితరులు

**ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎంవిఐ కె.రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఉప్పల్‌లోని జోషి విద్యానికేతన్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంవిఐ కె.రవీందర్‌రెడ్డితోపాటు, ఉమా, ఎఎంవిఐ శ్రీనివాస్, జోషి విద్యానికేతన్ కరస్పాండెంట్ జగదీష్ జోషి తదితరులు పాల్గొన్నారు. ఎంవిఐ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల తెలం గాణ వ్యాప్తంగా ఏటా సుమారు 7వేల మృత్యువాత పడుతున్నారని, అనేక మంది వికలాంగులుగా మారుతున్నారని తెలిపారు.సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపించవద్దని సూచించారు.తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటం



బడంగ్‌పేట్ డిసి త్రిల్లేశ్వర్‌రావును కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్ర రవి, మస్కూరి నర్సింహ తదితరులు

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలు, బడుగు బలహీన వర్గాలకు జరిగే అన్యాయాలపై రాజీలేని పోరాటం చేసే ఎమ్మార్పీఎస్‌కు కూడా ప్రాధాన్యతనివ్వాలని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావును మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. జిహెచ్ఎంసిలో విలీనమైన బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన ప్రాంతాలతో కొత్తగా ఏర్పడిన బడంగ్‌పేట్ సర్కిల్‌కు డిసిగా ఇటీవల వచ్చిన త్రిల్లేశ్వర్‌రావును మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి, బాలాపూర్ మండల ఇంఛార్జి బొర్ర రవి మాదిగ, సీనియర్ నాయకులు మస్కూరి సుధాకర్, డికె నర్సింహతో పాటు సోంపురం అంజిలు డిసిని కలిసి కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుండి బాలాపూర్ మండలంలో ప్రజలకు సంబంధించిన సమస్యలు, పాలకుల అవినీతి, అక్రమాలపై అదే విధంగా అణగారిన వర్గాలకు అండగా పలు పోరాటాలు చేశామని వివరించారు. అయితే జిహెచ్ఎంసిలో విలీనమైన ఈ ప్రాంతంలో ఎమ్మార్పీఎస్‌కు కూడా సముచిత ప్రాధాన్యతనివ్వాలని వారు త్రిల్లేశ్వర్‌రావును కోరారు. ప్రజలకు మేలు తలపెట్టే కార్యక్రమాలకు అండగా ఉండి ఎమ్మార్పీఎస్ తరపున సహకారం అందిస్తామని వారు స్పష్టం చేశారు.